₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 19

అక్టోబర్ 1-15, 2018



## వ్యక్తిని శక్తిగా మార్చేదే గాంధేయం


#Bapu 150



# 'గాంధీ ఛాలెంజ్' ని స్వీకరిద్దాం...

## మన ఆదాయం, సమయంలో కనీసం 10 శాతం సమాజానికిద్దాం !






# గాంధీజీ దృష్టిలో 7 మహా పాపాలు

- విలువలు లేని రాజకీయం
- శ్రమ లేని సంపద
- నీతి లేని వ్యాపారం
- శీలసంపద లేని విజ్ఞానం
- మానవత్వం లేని శాస్త్రం
- ఆత్మసాక్షి లేని ఆనందం
- త్యాగనిరతి లేని ఆరాధన

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

అక్టోబర్ 1-15, 2018 సంపుటి - 2 సంచిక - 19




## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

బాపూ జీవితం నేటికీ సందేశమే !.................... 5

మహాత్ముడి 5 ప్రజాస్వామిక సూత్రాలు............... 19

విశ్వసనీయత ఇలాగే దిగజారుతుంటే.............. 21

మన ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యమెంత.. 23

యాజలి గ్రామ "లక్ష్మీ".................................. 25

ప్రవాసులకు నజరానా.................................. 28

లాలూచీ లంచానికి - గతిలేక బలవంతంగా...... 30

ప్రభుత్వ వైద్య కళాశాల కోసం ........................ 33

వ్యక్తిని శక్తిగా మార్చేదే గాంధేయం................ 34

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**

*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

తులిప్స్ అపార్ట్‌మెంట్స్

6-3-655, ఫ్లాట్ నెం. 407

సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక

సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**

**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org

loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*

*ఏడాది చందా : రు. 200*

*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.


బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# సమయం, ఆదాయంలో కనీసం 10 శాతం సమాజానికివ్వండి



'నువ్వు నా వైపు చూస్తే, నేను నీ వైపు చూస్తాను' అని మనం దేవుళ్లుగా పూజించేవారు చెప్పినట్టు వింటుంటాం. 'జనమేమైనా అడుగుతున్నారా ఈ మంచి పనులు చేయమని, వాళ్లు అడగనప్పుడు మనకెందుకు?' అని సమాజంలో పాలకులుగా, నాయకులుగా, పౌర ప్రముఖులుగా చెలామణి అవుతున్నవారు చెబుతుండటాన్నీ వింటుంటాం. ఇలాంటి దేశంలో.. ఎవరో అడిగారని కాకుండా, తమ వంతు బాధ్యతగా సమాజహితం కోసం దశాబ్దాల తరబడి నిరంతరం పోరాడిన మహనీయుల్లో శిఖరసమానుడు గాంధీజీ! ఈ అక్టోబర్ 2 బాపూజీ 150వ జన్మదినోత్సవం. ఏడాది పొడవునా ఉత్సవాలు జరుపుతామని పాలకులు ప్రకటించారు. కానీ గాంధీజీని ఇంకా గ్రహాంతరవాసిలాగానే, కొన్ని పదులు, వందల సంవత్సరాల తర్వాత అందుకోగలిగిన వ్యక్తిగానే కొనసాగిస్తూ ఉత్సవాలు చేయటం వల్ల ప్రయోజనముండదు. గాంధీ తన తరం మనిషి, ప్రతి తరం మనిషి! ఆయన దీర్ఘకాలిక దృష్టితో శతాబ్దాలపాటు భారతదేశానికి, మానవాళికి మేలు చేయాలని ఆలోచించారుగానీ, వర్తమానంతో సంబంధం లేకుండా ఎప్పుడో వందల ఏళ్ల తర్వాతి సమాజం కోసం మాత్రమే పనిచేయలేదు. స్వతంత్రం లేదా స్వరాజ్యం గురించి గాంధీ ఏం చెప్పారో ఉదాహరణగా చూడండి. 'అర్ధరాత్రి మహిళలు నిర్భయంగా రోడ్ల మీద సంచరించ గలిగినప్పుడే దేశానికి నిజంగా స్వాతంత్ర్యం వచ్చినట్టు', 'తన బతుకు మీద తనకు అధికారం ఉందని చిట్టచివరి పౌరుడు కూడా ధీమాగా భావించినప్పుడే స్వరాజ్యం వచ్చినట్టు' అని గాంధీజీ చెప్పారు. ఈ రెంటినీ సాధించటానికి ఏం చేయాలి? చట్టబద్ధపాలన, పౌరసేవల చట్టం, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత వంటి ఏర్పాట్లు చేయాలి. పెద్ద ఖర్చు లేకుండా కొద్దికాలంలోనే ఈ పనుల్ని ప్రభుత్వాలు చేసేయచ్చు. కానీ స్వతంత్రం వచ్చి డెబ్బై ఏళ్లు దాటినా వీటిని చేయలేదు. ఈ వైఫల్యమే గాంధీజీని మ్యూజియం వస్తువుగా మార్చేస్తోంది. 'గాంధీ ఛాలెంజ్'ని ఈతరమైనా పూర్తిస్థాయిలో స్వీకరించాలి. కాస్త అవగాహన, సాంకేతిక పరిజ్ఞానం సాధనాలుగా నేటి యువశక్తి బాపూజీ ఆశించిన అద్భుతాల్ని సాకారం చేయాలి. తగిన పద్ధతుల్లో ఈ దిశగా ఆచరణను చేపడితేనే బాపూజీ 150వ జన్మదిన ఉత్సవాలకు సార్థకత చేకూరుతుంది. మ్యూజియంలో గాంధీజీ విగ్రహాన్ని రూపొందించటంపై సూచనలిస్తూ.. గాంధీగారి చేతిలో చీపురుకట్ట ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించినట్టు వార్తలచ్చాయి. కానీ బాపూ అంత పరిమితమైన వ్యక్తి కాదు. ఆయన స్వచ్ఛత కేవలం మురుగుదొడ్ల స్వచ్ఛభారత్‌కు పరిమితమైనది కాదు. కుల, మత వివక్షల్ని, విద్వేషాల్ని మన మనసుల్లో నుంచి పెకలించి స్వచ్ఛతను నెలకొల్పాలని ఆయన సంకల్పించారు. కేవలం పాతికేళ్ల వయసప్పుడు దక్షిణాఫ్రికా రైల్వేస్టేషన్‌లో జరిగిన ఒక అవమానం ఆయనను ఈ దిశగా మరల్చింది. యువతను అవమానించేలా మూకుమ్మడి నిరుద్యోగ భృతిని ప్రకటించిన పాలకులకు ధన్యవాదాలు తెలిపే పట్టభద్రులను తయారుచేస్తున్న ఈ సమాజానికి.. 125 ఏళ్ల క్రితం, తన పట్ల జరిగిన అవమానానికి ప్రతిస్పందనగా వ్యవస్థలో మార్పు కోసం సంకల్పం తీసుకున్న గాంధీ అనే పట్టభద్ర యువకుడి ఆత్మగౌరవం గురించి మళ్లీమళ్లీ గుర్తుచేయాలి. గాంధీలో అన్నీ సరైనవే అనుకోవాల్సిన పని కూడా లేదు. ఉదాహరణకు, తాను చెప్పిన విధానాలకు తగిన వ్యవస్థల నిర్మాణం మీద ఆయన కూడా పెద్దగా దృష్టి పెట్టలేదు. అనుచరుల వ్యక్తిగత నిజాయతీ మీద ఎక్కువ ఆధారపడ్డారు. తానో అరాచకవాదినని కొన్ని సందర్భాల్లో స్వయంగానే అంగీకరించారు. ఈ దేశంలో అందరికీ చదువు రావటం ఇరవయ్యో శతాబ్ద కాలంలో సాధ్యం కాదనుకున్నారు. అందుకే, అవగాహన చుట్టూ కాకుండా విశ్వాసం చుట్టూ ఆందోళనల్ని ప్రోత్సహించారు. గ్రామాలు స్వయంసంపూర్ణంగా ఆదర్శప్రాయంగా విలసిల్లుతాయని రొమాంటిసిజంతో కలలు గన్నారు. ఇలాంటి లోపాల్ని మనం సరిచేసుకోవాలి. వ్యక్తిగత నిజాయతీని కనీస అర్హతగా పరిగణిస్తూనే 'వ్యవస్థీకృత నిజాయతీ' దిశగా మనం ప్రయత్నం చేయాలి. విశ్వాసం చుట్టూ కాకుండా.. అవగాహన చుట్టూ ఉద్యమాల్ని, ఉమ్మడి కార్యక్రమాల్ని నిర్వహించాలి. గ్రామస్వరాజ్యం కులవ్యవస్థ బారినపడకుండా ఉండేందుకుగాను ఒక్కో గ్రామానికి కాకుండా.. గ్రామాల సముదాయానికి చిన్న పట్టణాలు కేంద్రంగా స్వయంప్రతిపత్తి స్థాయి సాధికారతనివ్వాలి. అంటే, ఇక్కడ మనం గాంధీని, అంబేద్కర్‌ని కలపాల్సి ఉంది. గాంధీజీ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి. జాతీయోద్యమంలో ఆయన చేసిన పెద్ద ఉద్యమాలు కూడా మూడో, నాలుగో మాత్రమే. అయినా ప్రజల్ని బాగా ప్రభావితం చేయగలిగారు. గాంధీగారి పిలుపును అనుసరించడానికి అనేకమంది ప్రజలు పూర్తి సమయాన్నిచ్చారు. కానీ తీరిగ్గా సాగే వ్యవసాయాధారిత ఆర్థికవ్యవస్థ స్థానంలో పోటీ వ్యవస్థ పెరుగుతున్న ఈ రోజుల్లో అలా సాధ్యం కాదు. అందుకే ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత తమ సమయంలో, ఆదాయంలో కొంతమేర సమాజం కోసం కేటాయించే నమూనాను ఎంచుకోవాలి. మనకు వచ్చిన  అరకొర స్వరాజ్యాన్ని సంపూర్ణ స్వరాజ్యంగా, సురాజ్యంగా మార్చాలి. సోషల్ మీడియా, ఇతర సాంకేతికతల్ని ఇందుకు అనువుగా ఉపయోగించుకోవాలి. మనదేశం అగ్రరాజ్యం కాబోతోందని పాలకులు పైకి చెబుతున్నారుగానీ, ఆ అవకాశాన్ని చేజార్చేలాగానే వారు వ్యవహరిస్తున్నారు. కాస్త మధ్యస్థ ఆదాయమున్న దేశంగా భారత్‌ని నిలబెట్టగలిగితే చాలని మన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు తదితరులు నిర్ణయించేసుకున్నారు. జనం ముందు మాత్రం నటిస్తున్నారు. భారత్ పేదరికాన్ని జయించేస్తోంది.. అని వస్తున్న పలు అంతర్జాతీయ నివేదికలు కూడా ఈ పరిమిత లక్ష్యానికనుగుణంగానే రూపొందుతున్నాయి. దీనర్థం ఓ పది శాతానికి తప్ప ఈ దేశంలో ఇక గొప్పగా ఎదిగే అవకాశాలుండవు. ఈ అవకాశాలు కూడా ఎక్కువగా పుట్టుకను బట్టే నిర్ణయమైపోతాయి. వివక్ష లేకుండా ఎదిగే అవకాశాలకు కీలకమైన రంగాలను, పాలనాంశాలను పట్టించుకోకపోవటం వల్లే  భారత్ లక్ష్యం పరిమితమైపోయి తొంభై శాతం ప్రజానీకం అరకొరగా, ఉన్నదాంతో సర్దుకుపోయే దిగువ మధ్యతరగతిగానే మిగిలిపోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని మార్చటానికి ప్రధానంగా యువత గాంధీ ఛాలెంజ్‌ని స్వీకరించాలి. 'నివారించదగ్గ బాధలను తొలగించే, పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే' అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించటానికి నడుం కట్టాలి. గాంధీలా అందరూ జీవితాల్ని త్యాగం చేయనక్కర్లేదు. కానీ ప్రతి ఒక్కరూ చట్టబద్ధపాలన, అందరికీ నాణ్యమైన విద్య-ఉపాధి, ఆరోగ్యం, లాభసాటి వ్యవసాయం, హక్కుగా పౌర సేవల చట్టం, స్థానిక ప్రభుత్వాల సాధికారత వంటి లక్ష్యాల కోసం తమ సమయం, ఆదాయంలో 10 శాతం,  అది కూడా స్థానికంగా ఎక్కడికక్కడ (ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా మార్పును తెచ్చే అవకాశాలు కన్పించటం లేదు కాబట్టి) కేటాయిస్తే చాలు.. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఉత్సవాలకు దూరంగా ఢిల్లీకి వెలుపల ఎక్కడో ఉండి గాంధీజీ కార్చిన కన్నీటిని తుడవగలం.

# బాపూ జీవితం నేటికీ సందేశమే!




'నా జీవితమే నా సందేశం' అని చెప్పే అరుదైన శక్తి ఉన్న నాయకుడు మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీ.

ఆయన ఈ మాటలు చెప్పి దశాబ్దాలు గడిచినా, క్యాలెండర్‌లో ఓ శతాబ్ది, సహస్రాబ్ది మారిపోయినా.. 21వ శతాబ్దంలో ఈవేళ కూడా గాంధీజీ జీవితం మన చుట్టూ చాలా అంశాల్లో సందేశంగానే కొనసాగుతోంది. బాపూగా ఆత్మీయతని, మహాత్ముడిగా దార్శనికతను గాంధీజీ అందిస్తూనే ఉన్నారు.

ఈతరానికి కూడా సందేశంలా ఉండే గాంధీజీ జీవితాన్ని తెలియజెప్పే కొన్ని ఘటనల్ని మహాత్ముడి 150వ జన్మదినోత్సవ సంవత్సరం ప్రారంభం సందర్భంగా లోక్‌సత్తా టైమ్స్ ఈ సంచికలో అందిస్తున్నాం. గాంధీజీతో కలిసి ఎన్నో ఏళ్ల పాటు గడిపిన కనూ గాంధీ, ఆభా గాంధీ రాసిన పుస్తకం నుంచి వీటిని తీసుకున్నాం.

మహాత్ముని జీవితంలో ప్రత్యక్ష భాగస్వామ్యంతో చెప్పిన విశేషాలు కావటంతో ఇవి అదనపు ప్రామాణికతను సంతరించుకున్నాయి. సాధారణ వ్యక్తి నుంచి విశ్వమానవ స్థాయికి ఎదగటానికి కావలసిన అనేక అంశాలు ఇందులో ఉన్నాయి.

"ఎందరో నాయకులకు జై కొట్టారు కానీ సుభాష్‌కి ఎవరూ జై కొట్టనే లేదు. నాకు చాలా దు:ఖం కలిగింది.

"జవహర్ నా వద్ద తన కష్టాలను, తన బాధలను చెప్పుకొని సలహాలు తీసుకోవడానికి వస్తే అప్పుడు నేను కూడా నవ్వక గంభీరంగానే ఉంటే నా గాంభీర్య ముఖం చూసి పాపం అతను చచ్చేపోతాడు. అతడి రాజ్యంలో బాపూజీకే ఇంత మానసిక కష్టం కలుగుతుంటే, అతడు మానసిక శాంతిని చేకూర్చలేకపోతే, తను భారతదేశపు ప్రధానమంత్రి పదవిలో ఉండడంలోని అర్థం ఏమిటని ఆలోచిస్తాడు. అందుకే జవహర్ వచ్చినప్పుడు నేను నా చెంపలను వాయించుకొని నా బుగ్గలను ఎర్రగా ఉంచడానికి ప్రయత్నిస్తాను.

"వీగిపోనియ్. నాకలాంటి స్వరాజ్యం అక్కరలేదు. సత్యాగ్రహం కోసం జనం బైట నుండి రావటమా! కథియవాడీలకు స్వరాజ్యం కావాలంటే కథియవాడీలే సత్యాగ్రహం చేయాలి. స్వరాజ్యం కావలసింది కథియవాడీలకైతే గుజరాతీలెందుకు పోరాడాలి? ఇదేం సబబు?".. వంటి లోతైన స్పందనలున్నాయి.

యువ భారతీయులు ఎంత నేర్చుకోగలిగితే అంత సందేశం మహాత్ముని ఈ నిత్యజీవిత పనుల్లో, మాటల్లో, స్పందనల్లో దాగి ఉంది..

### నా రాముడు - ఆ రాముడు కాదు

1941లో మహాత్మాగాంధీ అభిమాని సతీష్‌చంద్ర గుప్తా అనే ఆయన బాపూని ప్రశ్నించాడు. "బాపూ! మీరు గొప్ప రామభక్తులు. రాముని జీవితం నుంచి మీకు చాలా ప్రేరణ లభించిందని అంటారు. వాలి సుగ్రీవుల ద్వంద యుద్ధంలో రాముడు మోసంతో వాలిని వధించాడు. ఆయన బంగారులేడి వెంట

పరుగులెత్తాడు. ఇలాంటి విషయాలెన్నో ఉన్నాయి. అయినా సరే మీరు రాముణ్ణి ఎందుకు ఆదర్శంగా తీసుకుంటారో నాకు అర్థకం కావడం లేదు".

"వాలి సుగ్రీవుల యుద్ధంలో మోసం చేసినవాడు నా రాముడు కాడు. మాయా మృగం వెనుక పరుగులెత్తినవాడు నా రాముడు కాడు. అయోధ్యానగరపు సింహాసనం లభించనున్నప్పుడు ఎన్నో ఏళ్ల క్రితం తన తండ్రి ఇచ్చిన మాటను పాటించడం కోసం వనవాసం వెళ్లడానికి ఆనందంగా అంగీకరించిన రాముడు నా రాముడు" అని బాపూ జవాబిచ్చారు.

కొంచెంసేపయిన తరువాత ఇంకా ఇలా అన్నారు. "భరతుడు ఆయనను పిలవడానికి రాజ్యం మీరే చేయండని వెళ్లాడు. అయినా సరే ఆయన దానిని స్వీకరించలేదు. ఆయనే నా రాముడు. ఒక చాకలి మాటలకు విలువనిచ్చి నిష్కళంక అయిన సీతను కూడా త్యజించిన రాముడు నా రాముడు. ఇలాంటి ఎన్నో గుణాలు రామునిలో ఉన్నాయి. ఏ వ్యక్తీ సంపూర్ణుడు కాడని మనం అర్థం చేసుకోవాలి. మనం ఎల్లప్పుడూ గుణగ్రాహులమై ఉండాలి. ఇదేవిధంగా మంచి గుణాలను గ్రహిస్తూ పోతేనే మనకు ఔన్నత్యం కలుగుతుంది. నీరు కలిపిన పాల నుండి కేవలం పాలను గ్రహించే హంస వలె మనలో ఈ శక్తిని వికసింప చేసుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడే మనం మన నిజమైన మంచి జీవితాన్ని వికసింప చేసుకో గలుగుతాము. అర్థ మయ్యింది గదా?" అని బాపూ ఓపికగా అంతా అర్థమయ్యేలా చెప్పిన తరువాత అడిగారు.

సతీష్‌బాబు ఆనందంతో తలూపారు.

## హరిజన కార్యం కాబట్టే అంతగా పట్టుబడుతున్నా

ట్రావణ్‌కోర్ (తిరువాన్‌కూర్) మహారాజు తన జన్మదినం రోజున తన సంస్థానంలోని అన్ని మందిరాలను హరిజనుల కోసం తెరవాలని నిర్ణయించారు. ఆ సమయంలో బి.ఆర్ రామచంద్రన్ తిరువాన్‌కూర్ హరిజనసేవక్ సంఘంపు మంత్రిగా ఉన్నారు. మహారాజు ఆయనతో "ఈ సందర్భంగా గాంధీజీ ఇక్కడకు వస్తే నాకు చాలా సంతోషం కలుగుతుంది" అన్నారు. గాందీజీ సమక్షంలో వారికి అత్యంత ప్రియమైన ఒక కార్యం చేయగలిగిన భాగ్యవంతుడినని నన్ను నేను భావిస్తాను. మీరు వారిని ఇక్కడకు రావడానికి అంగీకరింపచేస్తారా? వారు అంగీకరిస్తే ఆహ్వానం పంపిస్తాను. వారు సంస్థాన అతిథులుగా ఉంటారు'' అన్నారు. రామచంద్రన్ గాంధీజీకి ఇదంతా ఉత్తరం ద్వారా తెలియపరచారు. బాపూ అక్కడకు వెళ్లడానికి అంగీకరించారు. బాపూ స్వీకరావపత్రం లభించగానే రామ చంద్రన్‌గారు మహారాజు వద్దకు వెళ్లి వారికి స్వీకృతి పత్రం ఇచ్చారు. తదనుసారంగా మహారాజు గాంధీజీకి ఆహ్వానపత్రం పంపించారు.

బాపూ వెంట మేము అక్కడికి బయలుదేరాము. బాపూ ఏదో పని మీద పూణెలో ఒకరోజు ఉండవలసి వచ్చింది. బాపూ ఎక్కడికి వెళ్లినా సాయంత్రపు ప్రార్థన సామూహికంగానే జరిగేది. బాపూ సరిగ్గా సమయానికి ప్రార్థనకు వచ్చారు. నన్ను దిల్‌రుబా లేకుండా చూసి ఆయనకు ఆశ్చర్యం కలిగింది. దు:ఖస్వరంతో ప్రార్థన సభలో కూర్చోగానే "కనైయ్యా! నీ దిల్‌రుబా ఎక్కడుంది" అన్నారు.

"బాపూ దిల్‌రుబా తేలేదు" అన్నాను.

ప్రార్థన అయిన తరువాత నివాసస్థానానికి చేరగానే బాపూ మళ్లీ ఆ ప్రశ్నే అడిగారు. "దిల్‌రుబా ఎందుకు తేలేదు? అది ఎప్పుడూ నీవద్దే ఉండాలి. ప్రత్యేకించి ఈ పర్యాయం అయితే మనం హరిజనుల కోసం మందిర ప్రవేశాన్ని ప్రారంభించబోతున్నామాయె. దిల్‌రుబా తేకుండా నువ్వు చాలా తప్పుచేశావు".

మహదేవ్ భాయి నన్ను రక్షించారు. ఆయన వెంటనే అసలు సంగతి తెలియపరుస్తూ "బాపూ! ఇందులో కనూ తప్పు ఏమీ లేదు. పాపం అతడు దిల్‌రుబా తీసుకురావాలనుకున్నాడు. కానీ సామాను ఎక్కువ ఉన్నందున నేనే వద్దన్నాను" అన్నారు.

''ఒకవేళ సామాను ఎక్కువ ఉన్నట్టయితే నాకు చెప్పవలసింది. నేను నా పక్క వదిలేసేవాడిని. అది లేకుండా నేను ఉండేవాణ్ణి. కానీ హరిజనుల కోసం మందిరాలు తెరుస్తున్న సమయంలో కనూ వద్ద దిల్‌రుబా లేకపోతే అది నాకెలా ఇష్టమవుతుంది? నేనెలా సహించగలను? వార్ధాలో ప్రార్థన, భజన, రామాయణం అన్నీ అతడు దిల్‌రుబాతోనే పాడతాడు. అది నాకు చాలా ఇష్టం. ఇప్పుడు మందిరాలలో ప్రారంభోత్సవ సమయంలో కనూని నేను దిల్‌రుబా లేకుండా ఎలా చూడగలను. దిల్‌రుబా అయితే తీసుకోవలసిందే! పూణెలో కొనండి!" అని చెప్పి తన అనుచరురాలైన ప్రేమ్‌లీలా బహన్ థాక్కరీకి విషయం అంతా చెప్పి దిల్‌రుబా తెప్పించమని చెప్పారు. పూణెలో మేము వారింటిలోనే మకాం చేశాం.

"ఇంకా వేరే చోటకి వెళుతుంటే నేను దిల్‌రుబా ఉండాల్సిందేనని ఇంత పట్టుపట్టేవాడిని కాదు. హరిజన కార్యం

నా జీవితానికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్యం. అందువల్ల హరిజనుల కోసం మందిరాలు తెరుస్తున్నప్పుడు ప్రార్థన బాగా చేయాల్సిందే!'' అని బాపూ తరువాత అన్నారు.

## గుడ్డి నమ్మకాలను నాశనం చెయ్యాలి

ఇది 1930 నాటి సబర్మతి ఆశ్రమం సంగతి. ఆశ్రమంలో చాలామంది పిల్లలకు మశూచి సోకింది. వారికి బాపూ వైద్య సాయం చేసేవారు. చికిత్సలో తిండి బంద్. వేడినీళ్లలో పర్మాంగనేట్ పొటాష్ వేసి తొట్టె స్నానం చేయించేవారు. ఆ రోజులలో నాకు మశూచి సోకింది. బాపూ నన్ను కూడా ఇదే వైద్యం తీసుకోమన్నారు. దాంతో మా నాయనమ్మ బాపూతో "మశూచిలో నీరు తగలటం నిషేధించబడింది. మరి మీరేమో నీటిలో కూర్చోబెట్టమని చెబుతున్నారు. దీనివలన 'మాత' కోపగించుకుంటుంది" అన్నది. బాపూ నాయనమ్మకు నచ్చచెబుతూ "దేవ్ వదినా! మీరెందుకంత భయపడతారు? నీటితో స్నానం చేస్తే 'మాత' కోపగించుకోదు. చూడండి- ఆశ్రమంలో చాలా మందికి మశూచి వచ్చింది. అందరికీ ఇదే వైద్యం చేయించాము. నేటివరకూ మాత ఎవరిపైనా కోపగించుకోలేదు. మరి కనూ మీద ఎందుకు కోపగించుకుంటుంది? మనం ఈ పురాతనమైన గుడ్డినమ్మకాలను పాతపద్ధతులను విడిచిపెట్టవలసిందే! మరం ఒకవేళ విడిచిపెట్టకపోతే ఇతరులను వీటిని విడిచిపెట్టమని ఎలా చెప్పగలం! మీరేమీ భయపడవద్దు" అన్నారు.

బాపూ మీద మా నాయనమ్మకు చాలా నమ్మకం. అందువల్ల ఆమె సంతోషంగా ఆయన మాటను మన్నించి నన్ను వేడి నీళ్ల తొట్టిలో కూర్చోడానికి అనుమతించింది. నేను ఏడు రోజులలో పూర్తిగా ఆరోగ్యవంతుడనయ్యాను. బాపూ ఆమెను "ఏం వదినా! కనూ పూర్తిగా బాగయ్యాడు కదా. చూశారా మాత కోపగించుకోలేదు" అని అడిగారు కూడా.

## సహానుభూతితో స్పందించేవారు

1939 వేసవి రోజులు. సేవాగ్రామ్ (వార్ధా)లో ఎండలు తీవ్రంగా ఉంటాయి. మధ్యాహ్న సమయం బాపూ భోజనం చేశాక నియమానుసారం పడుకుని ఉత్తరాలు చదువుకుంటున్నారు. బాపూ అనుయాయి సోదరి అమతుస్సలామ్ ఆయనకి విసనకర్రతో విసురుతూ ఉంది. బాపూజీకి నిద్ర వచ్చింది. గాఢనిద్రలో మునిగిపోయారు. 15-20 నిముషాల తర్వాత ఆ మహిళకు కూడా నిద్ర రాసాగింది. ఆమె కాస్త ఒంగి దిండుకు చేరబడి విసరసాగింది.

కాసేపటికి ఆమెకూ నిద్ర వచ్చింది. చేతిలోని పంఖా జారిపోయింది. వెళ్లి బాపూ మీద పడింది. పంఖా పడిపోవటంతో బాపూకి మెళకువ వచ్చింది. ఆ మహిళకు కూడా నిద్ర వచ్చిందని చూశారు. పడిపోయిన విసనకర్ర తన చేతిలోకి తీసుకుని ఆ మహిళకు విసరసాగారు. చల్లనిగాలి తగలడం వల్ల ఆ మహిళకు ఇంకా గాఢమైన నిద్ర పట్టింది. కాసేపయిన తర్వాత ఆమెకు మెళకువ వచ్చినప్పుడు బాపూ తనకు విసురుతుండటం చూసింది.

## ఆంగ్ల భాష మన హృదయాలను, మెదళ్లను ఆక్రమించింది

"కనైయా" మీరు ఇంతలోనే వార్ధా వెళ్లి బ్యాంక్‌లో ఖాతా తెరిచి తిరిగి కూడా వచ్చేశారే?" అడిగారు బాపూ.

"అవునండి" అన్నాను.

"మంచిది. అయితే దరఖాస్తు ఏ భాషలో చేశారో చెపు" అన్నారు.

''బాపూ! దరఖాస్తు ఆంగ్లంలో నింపాము" అని చెప్పాను.

"ఇంగ్లీషులో ఎందుకు? హిందీలోనే నింపవలసింది" అన్నారు బాపూ.

"బాపూ! దరఖాస్తు ఆంగ్లంలో ఉంది. అందువల్ల కేవలం ఆంగ్లంలోనే నింపే రివాజు ఉండవచ్చని మాకనిపించింది. నాకు కూడా హిందీలో నింపవచ్చని తట్టలేదు. అందుకే మేము ఆంగ్లంలో నింపివేశాము'' నేను వాస్తవాన్ని వివరించాను.

బాపూ నచ్చచెబుతూ "దీని అర్థం ఏమిటంటే- నీవెంట పంపించిన సోదరుడు కూడా నీకు ఇది చెప్పలేదన్నమాట. సరేలే, ఇందులో నీ తప్పు లేదు. ఆంగ్లం మన బుర్రలలో ఆంగ్లభాష భూతాన్ని కూర్చోబెట్టింది. మనం ఏ రెండవ భాష గురించీ ఆలోచించనే లేము. బ్యాంక్ వాళ్లు కూడా ఫారాలు కేవలం ఆంగ్లంలోనే అచ్చువేయిస్తారు. నీవెంట పంపిన అనుభవజ్ఞుడయిన సోదరుడు కూడా నీకు అలా చెబుతాడని నేను ఆలోచించలేదు. సరే! జరిగిందేదో జరిగిపోయింది. బ్యాంకులలో ప్రాంతీయ భాషలలో కూడా వ్యవహారం చేయవచ్చని జ్ఞాపకం ఉంచుకో. మనం మన ప్రాంతీయ భాషలో కూడా ఫారాలు భర్తీ చేసి సంతకాలు చెయ్యాలి" అన్నారు. బాపూ తన పేర ఆంగ్లంలో వచ్చిన చెక్కుల వెనక హిందీలోనే సంతకం ఎందుకు చేసేవారో నాకు అర్థమయింది.

1938 డిసెంబర్‌లో సేవాగ్రామంలో స్కౌట్‌ల కవాతు కార్యక్రమం జరిగింది. బాపూ చేతులతో జెండా ఎగురవేయవలసి ఉంది. జెండా ఎగురవేసేటప్పుడు బాపూ జెండా చిహ్నంతో పాటు ఇంగ్లీషులో ఏదో

రాసి ఉండడం చూశారు. ఇది చూసి ఆయనకు బాధ కలిగింది. వెంటనే దానిని వ్యతిరేకిస్తూ,

''స్కౌట్‌ల ఈ జెండాలో చిహ్నంతోపాటు ఆంగ్లంలో ఎందుకు రాయబడింది? ఇది నాకర్థం కావడం లేదు. ఆంగ్లభాష మన హృదయం, మస్తిష్కం రెండింటిపైనా ఎంత స్థానాన్ని ఆక్రమించుకుందంటే మనం మన జెండా విషయంలో కూడా ఆంగ్లం లేకుండా పనిచేసుకోలేము. ఇది మనం హిందీలో రాస్తే ఈ జెండా మహాత్మ్యం తగ్గుతుందా ఏం? జెండా మీద ఆంగ్లంలో రాసి ఉందని నాకు తెలిసి ఉంటే నేనిక్కడకు రావడానికే అంగీకరించేవాడిని కాను. నా మాట మీకర్థమయి ఉంటే ఇప్పటి నుంచే ఈ పొరపాటును సరిదిద్దుకోండి. హిందీలో రాయించుకోండి" అన్నారు.

"ఇదేమి తమాషా? నాకు ఇచ్చే సన్మానపత్రం ఆంగ్లంలో ఎందుకు రాయబడింది? ఇంత పెద్ద గుంపులో ఆంగ్లం అర్థం చేసుకునేవారు ఎంతమంది ఉంటారు? అర్థంకాని వారి సంఖ్య ఎన్నో రెట్లు అధికంగా ఉంటుంది. సన్మానపత్రం చదవడం మానేయండి. ఆంగ్లంలో రాసిన అభినందనను నేను వినను" ఇలా చెప్పి బాపూ అభినందన పత్రాన్ని తీసుకున్నారు.

1938 నవంబర్‌లో దక్షిణ భారతదేశం వెళ్లినప్పుడు తెలుగునాట ఒక బహిరంగసభలో బాపూని అభినందిస్తున్నారు. చాలా భారీ సంఖ్యలో ప్రేక్షకులు పోగయ్యారు. ఆ సమయంలో అధ్యక్షుడు బాపూజీకి స్వాగతం అయితే తెలుగులోనే చెప్పారు. కానీ తరువాత ఇచ్చే సన్మానపత్రం నిలబడి చదవసాగేరు. ఏవో రెండు పంక్తులు చదివారోలేదో బాపూ ఆ సన్మానపత్రం చదవడాన్ని ఆపివేశారు.

"బాపూ! క్షమించండి! ఇందులోని రాసి ఉన్న విషయాన్ని తెలుగు భాషలోకి అనువదించి అందరికీ వినిపించనా?" అని స్వాగతం పలుకుతున్న అధ్యక్షుడు అడిగారు. బాపూ అనుమతించాక ఆ సన్మానపత్రాన్ని తెలుగులో వినిపించారు.

**అక్షరాలు బాగా రాయి**

"బాపూ మీ అక్షరాలు బాగోవు – మరి మమ్మల్ని అక్షరాలు బాగా రాయమని ఇంత పట్టుపడతారెందుకు?"

దీనికి జవాబుగా "నువ్వన్నది నిజం – నా అక్షరాలు ఏమీ బాగోవు. అందుకనే నేనిప్పుడు పశ్చాత్తాప పడుతున్నా. మీరు పశ్చాత్తాపం చెందకూడదనే నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. బాల్యంలో అక్షరాలు సరిగ్గా రాయడం అభ్యసించకపోతే పెద్దవాళ్లయ్యాక సరిదిద్దడం చాలా కష్టం. పెద్దవయస్సు వున్న వాళ్లు మనకేదైనా తమ అనుభవంతో చెబితే వారి మాటలపై శ్రద్ధ వహించడం మనకు లాభదాయకమవుతుంది. అందుకే మీ అందరినీ మాటమాటకీ హెచ్చరిస్తూ ఉంటాను.

బాపూ పాఠాన్ని చాలామంది పిల్లలు పాటించారు. వారు తమ అక్షరాలను దిద్దుకొన్నారు కూడా.

**ఆదర్శ ఉపాధ్యాయుడు**

"చూడు కనైయ్యా! నీనెత్తిన నేను ఎక్కువ భారం వెయ్యబోతున్నా. నువ్వు భయపడవు గదా! నేను బొంబాయి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభలకు వెళ్లాలి. ఈసారి ఎక్కువమందిని నా వెంట తీసుకువెళ్లను. కేవలం మహాదేవ్‌నీ నిన్నే తీసుకెళతాను. అందువల్ల నువ్వు నా పనులన్నీ అర్థం చేసుకో" నాతో అన్నారు బాపూ.

నేను 1934లోనే బాపూ సిబ్బందిలో చేరాను. బాపూ ఆఫీసు పనంతా మహాదేవ్ భాయ్ నాకెంతో ప్రేమగా నేర్పించారు. బాపూ సొంత పనులు, అన్నం వండడం, బట్టలు ఉతకడం, అల్పాహారానికి పళ్లు సిద్ధం చెయ్యడం ఇలాంటి కార్యాలు చేసే అవకాశం నాకింతవరకూ లభించనే లేదు. ఇప్పుడు బొంబాయి వెళ్లేటప్పుడు ఈ పనులన్నీ చేసేవారిని బాపూ తన వెంట తీసుకువెళ్లడం లేదు. అందువల్ల వారు నన్ను ఈ పనులన్నీ నేర్చుకోమన్నారు. నేను తయారయ్యాను.

బాపూ జీవితం చాలా సాధారణమైనది. కానీ ఆయనకు అన్నీ పరిశుభ్రంగా ఒక క్రమపద్ధతిలో కావాలి. బాపూ కళాప్రియులు కూడా. అందువల్ల బాపూ కోసం బత్తాయిలు, కమలాఫలాలు వలిచి వాటి తొనల లోపల ఉండే ముత్యాలు చెదరకుండా పైనున్న సన్నని పొరను తొలగించాలి. దీనికి చాలా జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. వాటినన్నిటినీ చక్కగా ఒక ప్లేటులో అందంగా అమర్చాలి. ఇది వినడానికి తేలికగానే ఉంటుంది. కానీ కమలాఫలంలోని ఒక్కొక్క తొనపొర దాని ముత్యాలు పగిలిపోకుండా వలవడం తేలిక కాదు గదా! అందువల్ల బాపూ స్వయంగా ఈ పని నేర్పుతానన్నారు. ఆయన ఒక కమలాఫలం తెప్పించారు. స్వయంగా నాకు మొదటి నుండి ఆఖరు వరకూ చెబుతూ చేస్తూ చూపించారు.

అప్పుడు నా వయసు 17 సంవత్సరాలు. అయినా ఇలాంటి పని చేసే అవకాశం నాకెన్నడూ లభించలేదు. బాపూ ఎంత చక్కగా నేర్పారంటే నాకు వెంటనే వచ్చింది. రెండో రోజున బాపూ కఠినమైన పరీక్షలో ఉత్తీర్ణుణ్ణి కూడా

అయ్యాను. బాపూ తరచు "ఎవరైనా విద్యార్థి ఒకవేళ ఫెయిలయితే దోషం ఉపాధ్యాయుడిదిగా భావిస్తాను" అంటుండేవారు. సరిగ్గా శిక్షణ ఇచ్చేవాడే నిజమైన ఉపాధ్యాయుడు.

**పిల్లలను నేను చూసుకుంటా**

ఈ సంగతి 1928–29 నాటిది. బాపూ సబర్మతి ఆశ్రమంలో సోదరీ మణుల ఉదయం ప్రార్థన కోసం వేరే ఏర్పాటు చేశారు. ప్రార్థన తరువాత బాపూ వారితో "ఇప్పుడు నేను మీలో దాగి ఉన్న శక్తిని వికసింపచేసి దానిని దేశ వికాసం కోసం వినియోగించదలచినాను. మీకు ఆశ్రమం బాధ్యతలను అప్పగించి మీలో దాగి ఉన్న శక్తిని తెలుసుకునేలా చేసి మీలో ఆత్మవిశ్వాసాన్ని పెంచ గోరుతున్నాను. ఇందులో గోశాల, పారిశుధ్యం లాంటివి కొన్ని కార్యాలున్నాయి. వీటికి సోదరీమణులు ఉదయమే రెండు గంటల సమయం కేటాయించవలసి ఉంటుంది. దీనికి మీరు భయపడవద్దు" అన్నారు. చిన్నపిల్లల తల్లులు బాపూ మాటలు విని తమ ఇబ్బందుల గురించి చెబుతూ "మా పిల్లలు చాలా చిన్నవాళ్లు. మేమింత పొద్దుటే ఎలా ఈ పనులు చెయ్య గలుగుతాము?" అన్నారు.

దీనికి బాపూ "ఓహో – అంతేగదా! ఇంటిలో చిన్న పిల్లలను సంభాళించేవారు లేకపోతే వారు తమ పిల్లలను నా వద్ద విడిచిపెట్టి వెళ్లండి. మీపని పూర్తి చేసుకొని తిరిగి వచ్చేంత వరకూ నేను మీ పిల్లలను సంభాళిస్తాను. ఇంకేమీ ఇబ్బంది ఉండదు గదా?" అన్నారు.

"మేము స్త్రీలం, వంట ఇల్లయితే సంభాళించగలం గానీ స్టోర్సు, ఖాదీ భాండారం, గోశాలను, వాటి లెక్కాడొక్కా ఎలా సంభాళించగలం? మాకు వీటి అనుభవం బత్తిగా లేదు" అన్నారు సోదరీమణులు.

"మీరు ఏమనుకుంటున్నారు? పురుషులకివన్నీ జన్మతోనే వస్తాయనా యేం? మీకు వంటపని పుట్టినప్పటి నుండే వచ్చునా ఏం?" అని బాపూ అడిగారు.

"లేదు, పుట్టుకతోనే ఎవరూ ఏపనీ నేరుకొని రారు. ఏ పనైనా చేస్తూ ఉంటేనే నేర్చుకోవచ్చు" అని సోదరీమణులు జవాబిచ్చారు.

బాపూ వారికి ప్రోత్సాహాన్నిస్తూ "అదేగదా నేను అంటున్నది. పనే పనిని నేర్పుతుంది. ఒకసారి పనిచెయ్యడం ప్రారంభిస్తే అనుభవంతో వస్తుంది. ఆత్మవిశ్వాసం వృద్ధి చెందుతుంది. శక్తి వికసిస్తుంది. ఒకసారి సంకోచం, భయం విడిచిపెట్టి వనిచెయ్యడం ప్రారంభించండి. అంతా సవ్యంగానే జరుగుతుంది" అన్నారు.

"కానీ మాకు లెక్కలు చెయ్యడం రాదు గదా! ఖాదీ భాండారంలో, ధాన్యం అమ్మేటప్పుడు బిల్లులలో తప్పులు దొర్లితేనో?" సోదరీమణులు మూడవ పాయింట్ లేవనెత్తారు.

"దీనిని గురించి చింతించవలసిన అవసరం లేదు. లెక్కలో తప్పుల గురించి నాకేమీ చింత లేదు. ఎందుకంటే ఇలాంటి పొరపాట్లు లెక్కలు చేస్తుంటే అభ్యాసం వల్ల జరగకుండా పోతాయి. చూడవలసిందేమిటంటే, మన వల్ల ఏ విధమైన నమ్మకద్రోహమూ జరగకూడదు. ఈశ్వరుణ్ణి మీకిలాంటి సద్బుద్ధిని ప్రసాదించమని ప్రార్థించండి. ఒకసారి ధైర్యంగా పనిలో నిమగ్న మవ్వండి. దేవుడు సహాయం తప్పకుండా చేస్తాడు" అని బాపూ వారికి ధైర్యం చెబుతూ అన్నారు.

ఇంత చక్కగా బాపూ చెప్పిన మాటలు విని సోదరీమణులకు ధైర్యం వచ్చింది. వారు "సరే! మీరు కోరిన విధంగానే చేస్తాము" అన్నారు.

బాపూ సంతోషంగా "మీరు నా మాటలు అర్థం చేసుకున్నందుకు నాకు సంతోషంగా ఉంది. మీరు నా బాధ్యతని మొయ్యడానికి సిద్ధపడ్డారు" అన్నారు.

రెండు రోజుల తరువాత సోదరీ మణులకు పని అప్పగించబడినది. లెక్కలు చేసే పనిని కాస్త ఎక్కువ చదువుకున్నవారికి అప్పగించారు. బిల్లులు తయారు చేయడం నేర్పడానికి ప్రారంభంలో ఒక సోదరుడిని కూడా వెంట ఉంచారు. ముగ్గురు నలుగురు తల్లులు తమతమ చిన్న పిల్లలను బాపూ వద్ద విడిచిపెట్టి పనిలో నిమగ్నమయ్యారు. బాపూ పిల్లలను సంభాళించడానికి ఎంత చక్కని ఏర్పాటు చేశారంటే తల్లులంతా సంతోషపడిపోయారు. అలా ఎక్కువ రోజులు చేయవలసిన అవసరం లేకపోయింది. తల్లులే తమతమ పిల్లలకు ఏర్పాట్లు చేసుకుని పనికి సరైన సమయానికి రాసాగారు.

బాపూజీకి మొత్తం పని నివేదిక అందుతుండేది. సోదరీమణుల శక్తి వికాసం గురించి తెలుసుకొని బాపూజీకి చాలా ఆనందమయింది.

**అవసరానికి మించిన ఖర్చు అవాంఛనీయం**

బాపూ సబర్మతి ఆశ్రమంలో ఉండేవారు. సబర్మతి నది ఆయన నివాస స్థానానికి కొద్ది దూరంలోనే ప్రవహించేది. బాపూ భోజనం చేసిన తరువాత చేతులు కడుగుకునేప్పుడు, ఉదయం ముఖం

కడుగుకునేటప్పుడు, పుక్కిలించేటప్పుడు కొద్దినీరే చేతుల్లోకి తీసుకొనేవారు. చేతిలోంచి ఒక్క బొట్టు కూడా నేల పడకుండా ఆయన జాగ్రత్త పడేవారు. దీనిమీద గుజరాత్‌లో ప్రసిద్ధి చెందిన సంఘసేవకుడు రవిశంకర్ మహారాజ్ ఒకసారి “బాపూ! మీరు నీటిని ఉపయోగించడంలో ఇంత లోభితనం చూపుతారు ఎందుకు? ఇక్కడ నీటికేమీ లోటు లేదు గదా! నది ఎదుటే ప్రవహిస్తున్నది” అని అడిగారు.

బాపూ జవాబిస్తూ “మనకు అవసరానికి మించి కొంచెం కూడా ఎక్కువ ఉపయోగించరాదు. ఎక్కువ ఉపయోగించే అధికారం మనకు లేదు. అది ఉపయోగం కాదు. దురుపయోగమే అవుతుంది” అన్నారు.

“ప్రతి వ్యక్తీ దేశ సంపదను వృద్ధి చెయ్యాలి. ఒకవేళ అతడలా చేయలేకపోతే – కనీసం దేశ సంపదను నాశనం చెయ్యకూడదు. అలా చేస్తే అప్పుడు వారు సంపదను ఒకరకంగా వృద్ధి పరచినట్లే నేను భావిస్తాను” అని తరచూ అంటూ ఉండేవారు బాపూ.

**సుభాష్ బోస్ - బాపూ సూక్ష్మ అహింస**

“చూశావా మహాదేవ్! ఎందరో నాయకులకు జై కొట్టారు కానీ సుభాష్‌కి ఎవరూ జై కొట్టనే లేదు. నాకు చాలా దు:ఖం కలిగింది. సుభాష్‌కీ నాకూ ఎంత అభిప్రాయభేదం ఉన్నా అతను బెంగాల్ ప్రథమ సుపుత్రుడు గదా! అతడు భారతదేశానికి కూడా సుపుత్రుడే! స్వతంత్ర సంగ్రామంలో సైనికుడు. అతడు కూడా దేశం కోసం బలిదానం చేశాడు. అతని త్యాగాన్ని మనం మరచిపోరాదు. అలాంటి స్వాతంత్ర్య ధీరుడికి జై కొట్టలేదు. అదీ బెంగాల్‌లో. దీనివల్ల నాకు చాలా బాధ కలిగింది. ఇలా జరిగి ఉండాల్సింది కాదు” అన్నారు బాపూ.

బాపూ సేవాసంఘ సమావేశం కోసం మలి కాందా వెళుతున్నారు. వారిని సాగనంపడానికి స్టేషన్ వద్ద చాలామంది పోగయ్యారు. ప్రజలు పెద్దపెట్టున జయజయ ధ్వానాలు చేశారు. అలాంటి సమయాల్లో స్టేషన్లలో జన సమూహాన్ని చూసి హరిజన్ ఫండ్‌కి పెద్దఎత్తున విరాళాలు లభిస్తాయని బాపూ చాలా సంతోషంగా ఉండేవారు. కానీ ఆరోజు సంతోషం కనిపించడం లేదు. దానికి మాకు ఆశ్చర్యంగా ఉంది. విషయం ఏమిటో అర్థం కాలేదు. ట్రైను కదిలాక అహింసా పూజారి బాపూ నోటి నుండి పైన చెప్పిన భావాలు బయటపడ్డాయి. మాకు నిజమైన కారణం అర్థం అయింది. బాపూ సూక్ష్మమైన అహింసా దర్శనం మళ్లీ కలిగింది.

ఔను, సుభాష్, బాపూల మధ్య అభిప్రాయభేదాలుండేవి. సుభాష్ బాబు స్వరాజ్యం పొందే నీతి రీతి పూర్తిగా భిన్నంగా ఉండేది. అందుకే అభిప్రాయ భేదం కలిగింది.

కానీ బాపూ ప్రతి వ్యక్తి గుణగణాలను, వీరత్వాన్ని, దేశప్రేమను, బలిదానాన్నే చూసేశారు. వారి అహింస వ్యాఖ్యలో ఎవరినైన అవమానించడం పూర్తిగా నిషేధం. దానిని కూడా బాపూ ఒకరకమైన హింసగానే భావించేవారు. అందువల్లే బెంగాల్‌లో సుభాష్ బాబుకి జై కొట్టనందుకు బాపూ దానిని వారిని అవమానించడంగానే భావించారు.

**రాజకోట సత్యాగ్రహం**

1939లో రాజకోట సత్యాగ్రహం జరుగుతున్న రోజులలో బాపూ ఒక నెల బార్డోలీలో ఉన్నారు. ఆ సత్యాగ్రహం కళ్లెం సర్దార్ వల్లభాయి పటేల్ చేతిలో ఉంది. రాజకోట సంస్థానపు దమననీతితో సత్యాగ్రహులంతా అలసిపోయారు. సర్దార్‌కి సత్యాగ్రహం వీగిపోతుందేమోనని భయం. అందువల్ల ఆయన బాపూని “మీరు ఒకవేళ అనుమతిస్తే నేను గుజరాత్ నుండి ఐదారువేల సత్యాగ్రహులను రాజకోటకు పంపిస్తాను” అన్నారు.

“ఎందుకబ్బా! గుజరాత్ నుండి సత్యాగ్రహులను రాజ్‌కోట పంపటం దేనికో నాకు అర్థం కావటం లేదు” అన్నారు బాపూ.

“సంగతేమిటంటే దర్బార్ వీరావల్ దమననీతి వల్ల సత్యాగ్రహులు అలసిపోయారు. సత్యాగ్రహం వీగిపోతుందని నా భయం” అని పటేల్ చెప్పారు.

“వీగిపోనియ్. నాకలాంటి స్వరాజ్యం అక్కరలేదు. సత్యాగ్రహం కోసం జనం బైట నుండి రావటమా! కథియవాడీలకు స్వరాజ్యం కావాలంటే కథియవాడీలే సత్యాగ్రహం చేయాలి. స్వరాజ్యం కావలసింది కథియవాడీలకైతే గుజరాతీలెందుకు పోరాడాలి? ఇదేం సబబు? గుజరాత్ నుండి ఎవరైనా స్వయంసేవకులను పంపడంలో అర్థం లేదు. అసలు పంపకూడదు గూడా” బాపూ తన అభిప్రాయాన్ని స్పష్టమైన భాషలో చెప్పేశారు.

ఈ సంభాషణ విన్న కస్తూరిబా “నేను కథియవాడీ దానినే గదా” అన్నారు.

“అందులో సందేహమేముంది! నీవు ముందు కథియవాడీ దానివే” అన్నారు బాపూ.

“అయితే నేనీ రోజే రాజకోట

సత్యాగ్రహంలో పాల్గనడానికి వెళతాను" అన్నారు బా. ఇది విన్న సర్దార్ పటేల్‌కు చింత కలిగింది. ఆయన తన కూతురు మణిబెహన్‌ను కస్తూరిబాతో పంపడానికి నిశ్చయించారు. కస్తూరిబా, మణిబెహన్ ఆ రాత్రికే రాజకోట బయలుదేరి వెళ్లారు.

బా వీరవనిత. దేశీయ సంస్థాన సత్యాగ్రహంలో బాపూ బయటివ్యక్తిని ఎన్నడూ పంపలేదు. బాపూ బా ను కూడా పంపేవారు కాదు. కథియవాడీ ప్రజలు వీరులని చెప్పుకొంటారు. అలాంటి వారు అలసిపోవడం, సత్యాగ్రహం వీగిపోవడం కథియవాడ వీరమాత ఎలా సహించ గలదు? అందువల్ల స్వయం ప్రేరణతోనే ఆమె అక్కడికి వెళ్లడానికి సిద్ధపడ్డారు. రాజకోట చేరుకోగానే ఆమె ప్రవేశాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు చేసింది. బా దానిని మన్నించలేదు. బా, మణిబెహన్ ఇద్దరినీ నిర్బంధించారు. ఆ వార్త వాయువేగంతో వ్యాపించింది. సత్యాగ్రహులలో ఆవేశం వచ్చింది. వారికి కొంత ప్రాణం పోసినట్లయింది. సత్యాగ్రహం వీగిపోతున్న తరుణంలో రక్షింపబడింది. ఈ విజయం కస్తూరిబాకే దక్కుతుంది.

### గాంధీ ఎన్నడూ మోసం చెయ్యరు

"నేను ఆంగ్లేయుల శత్రువును కాను. కానీ వారి శోషణ యుక్తమైన రాజనీతికి ఘోరవిరోధిని. అందువల్లే ఆ రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకలించి పారవేయడానికి సత్యాగ్రహ ఆందోళన చేస్తున్నాను. స్వరాజ్యం సిద్ధించే వరకూ నేను పోరాడుతూనే ఉంటాను. నేను సత్యాగ్రహమనే మార్గాన్ని ఉపయోగించాను. తరచు రాజనీతిలో సత్యాన్ని పాటించడం జరగదు, దాని అవసరం కూడా లేదు అంటూంటారు. ఈ విషయం నాకు బోధపడదు. సత్యాగ్రహి ఎవరైనా సరే ఆ వ్యక్తి సత్యాగ్రహి అవుతాడు. అతనికి ఎవరన్నా భయం కలగదు. అతడు నిర్భీకుడవుతాడు. ఎందుకంటే అతని ప్రతి కార్యం బహిరంగంగా జరుగుతుంది. ఎవరైతే దాచడం లేక గోప్యతను పాటించడో అతడు తనంతట తానే అహింసకుడు అవుతాడు. అందువల్లే మేము ఒక ఆచరణ సంహితను తయారు చేశాము. ఆ లక్ష్మణ రేఖలో ఉన్నంతవరకూ – వారు సురక్షితంగానే ఉంటారు.

ఎంత తీవ్రంగా ఎంత ప్రామాణికంగా మనం దీనిని పాటిస్తామో అంత అధిక ప్రభావం ప్రజలపైనే కాదు, మన శత్రువులపైన కూడా పడుతుంది. వాళ్లు కూడా మనలను సంపూర్ణంగా విశ్వసించగలుగుతారు. వీరెన్నడూ మోసగించరని నమ్ముతారు. దీని నిదర్శనం మన జీవితం, మన ఆచరణతోనే సాధించగలం".

బాపూని కలుసుకోవడానికి చాలామంది ఆంగ్లేయులు వస్తూండేవారు. అనేకమంది ఆంగ్లేయులు బాపూజీకి మిత్రులు, ప్రశంసకులు, భక్తులు అయ్యారు. అందుకే బాపూని కలుసుకోవడానికి చాలామంది వచ్చేవారు. ఆయనతో మాట్లాడేవారు. బాపూ నిష్కపటమైన, నిష్కల్మషమైన హృదయాన్ని చూసి కొత్తగా వచ్చిన ఆంగ్లేయులు కూడా చాలా ప్రభావితులై వెళ్లేవారు. నేనొకసారి బాపూను "బాపూ! మీరేమో బ్రిటీష్ సామ్రాజ్యాన్ని కూలద్రోయడానికి నడుం కట్టారు. వారికి శత్రువే అయ్యారు. అయినా సరే ఇందరు ఆంగ్లేయులు మిమ్మల్ని ఎందుకు కలుసుకోవడానికి వస్తారు?'' అని అడిగాను. ఈ ప్రశ్నకు పైన ఉదహరించిన విస్తారమైన జవాబిచ్చారు.

తరచు శత్రువుగా భావించే వారిచ్చిన భోజనాన్ని ఎవరూ తిన్నగా భుజించనే భుజించరు. వారు ముందు తమ మనుషులకు తినిపిస్తారు. తరువాతే తింటారు. అందులో విషం కలపబడిందేమోనని వారికి భయం ఉంటుంది. కానీ బాపూ గురించి అలాంటిదేమీ లేదు. వారంతా బాపూ పెట్టిన భోజనాన్ని, ఆయన భారత వైస్రాయికానీ లేక బ్రిటీష్ అధికారి కానీ, శుభ్రంగా భుజించేవారు. ఎందుకంటే గాంధీజీ ఎన్నడూ మోసం చెయ్యడని వారికి విశ్వాసం. ఇలాంటి పేరు సంపాదించడం, విశ్వాసాన్ని పాదు కొల్పడం తేలికయిన విషయం కాదు. పైగా చాలా పెద్ద విషయం.

1942లో సత్యాగ్రహం రోజులలో 'క్విట్ ఇండియా' 'డూ ఆర్ డై' అనే నినాదాలను బాపూ ఇచ్చారు. ''ఈ పర్యాయం నేను ఈ బ్రిటీష్ రాజ్యానికి బహిరంగంగా విద్రోహినయ్యాను'' అంటూండేవారు. అయినప్పటికీ బ్రిటీష్ వారికి బాపూ మీద ఎంత నమ్మకమో అది చూద్దాము.

ఆగాఖాన్ మహల్‌లో నిర్బంధంలో ఉన్న కాలంలో 1943లో బాపూ 21 రోజులు ఉపవాస దీక్ష ప్రారంభించి నప్పుడు ఆయన సేవ చేయడానికి ప్రభుత్వం నుండి నాకు అనుమతి లభించింది. నేను ఆయనకు సేవ చేయడానికి లోపల ఉండడానికి వెళ్లేవాడిని. నేను నా వెంట కెమెరా కూడా పట్టుకువెళ్లాను. లోపలకు వెళ్లేటప్పుడు నా పేరు మాత్రం తెలుసుకునేవారు. నా వద్ద కెమెరా చూసి జైలు కాపలాదారు "దీనిని మీరు మీతో ఉంచుకోవచ్చు. కానీ సూపరింటెండెంట్‌గారి అనుమతి లేకుండా ఫోటో మాత్రం తియ్యవద్దు"

అన్నాడు. ఆయన ఏ నమ్మకంతో కెమెరాని లోపలకు తీసుకువెళ్లడానికీ, దగ్గర ఉంచుకోవడానికీ అనుమతిచ్చాడో దాని వెనుక సత్యాన్ని కోరే బాపూ ఉన్నాడని బ్రిటీష్ అధికారులకు పూర్తి నమ్మకం ఉంది. కను వద్ద కెమెరా ఉన్నా సరే గాంధీజీ అనుమతి లేకుండా అతనిని ఫోటో తీయనివ్వరని వారి విశ్వాసం.

## లెక్కంటే లెక్కే

"జమనాలాల్ జీ ఇదిగో మీరిచ్చిన పోస్ట్‌కార్డులు తిరిగి తీసుకోండి" బాపూ మూడు పోస్ట్‌కార్డులు తిరిగి ఇస్తూ అన్నారు. ఈ విషయం 1940 నాటిది. బాపూ బొంబాయి వెళ్లాల్సి ఉంది. ట్రైను ముప్పావుగంట ఆలస్యంగా నడుస్తోందని సేవాగ్రామ్ నుండి బయల్దేరి వార్ధా వచ్చాక తెలిసింది. వార్ధా పట్టణంలో జమనా లాల్‌జీకి గారి బంగళా ఉంది.

"మీరు ఇక్కడే ఉండండి. ట్రైను వచ్చాక మిమ్మల్ని స్టేషన్‌కు చేరుస్తాము" అని జమనాలాల్ పట్టుబట్టారు. బాపూ ఆ మాటకు ఒప్పుకొన్నారు. అక్కడే ఆగిపోయారు. ఎందరో వ్యక్తులు కలుసుకోవడానికి వస్తే వారితో మాట్లాడసాగేరు.

వారిని కలిసిన తరువాత రెండు మూడు ఉత్తరాలు రాయవలసి ఉంది. అందువల్ల ఆయన జమనాలాల్ గారిని పోస్ట్‌కార్డులు అడిగారు. వారు నాలుగైదు పోస్ట్‌కార్డులు ఇచ్చారు. బాపూ వాటిలో మూడు కార్డులు రాసేశారు. మిగతావి తిరిగి ఇచ్చేశారు.

ట్రైన్ వచ్చిన తరువాత బాపూ స్టేషన్‌కి వచ్చారు. ట్రైన్‌లో కూర్చోగానే వారు నన్ను తన చిన్న సంచి ఇమ్మని అడిగారు. దానిలో నుండి ఆయన మూడు ఎస్ట్‌కార్డులు తీసి జమనాలాల్‌జీ వైపునకు చెయ్యి చాచారు. ఇది చూసి జమనాలాల్‌జీ నవ్వుతూ "మీదంతా విచిత్రం. మా నుండి లక్షల రూపాయలు అడిగి తీసుకుంటారు. మరి ఈ రోజున మూడు పోస్ట్ కార్డులు తిరిగి ఇస్తున్నారు" అన్నారు.

"లెక్కంటే లెక్కే గదా! లక్షల రూపాయలు దానం రూపంలో తీసుకుంటాను. అది మీరు ఇస్తారు కూడా. ఈ మూడు పోస్ట్ కార్డులు తీసుకున్నానే - వాటి అవసరం పడబట్టి తిరిగి ఇద్దామనే ఉద్దేశంతో తీసుకున్నాను. కాబట్టి మీరు వీటిని తీసుకోవలసిందే! లెక్క సరిగ్గా ఉండాలి" అన్నారు బాపూ.

బాపూ బాగా పట్టుపట్టడంతో చివరకు జమనాలాల్‌జీ ఆ పోస్ట్ కార్డులను సంకోచిస్తూనే తీసుకోవలసి వచ్చింది.

## సంకల్పజ్ఞానం

రోజు తరువాత రోజు గడుస్తోంది. ఎనిమిది నెలలెప్పుడు గడిచిపోయాయో కూడా తెలియదు. ఇప్పుడు నేను హిందీ కూడా బాగా అర్థం చేసుకోసాగాను. హిందీలో మాట్లాడగలిగే దానిని కూడా. అందువల్ల సంతోషంగా ఉండేదాన్ని. ఆశ్రమంలో తిరుగుతూ తిరుగుతూ బెంగాలీ పాటూ భజనావళిలోని గీతాలనూ పాడుతూ ఉండేదాన్ని. నాకు మనసు లగ్నమయింది. నేను బాపూ వద్ద పొందిన స్నేహంతో తల్లిని ఇంటిని కూడా మరచిపోయాను. మా అమ్మ చాలా జబ్బుపడిందని వార్త వచ్చింది. నాన్నగారిని పిలిచారు. ఆయన వెళ్లడానికి బాపూ అనుమతి అడిగారు. నాన్నగారు వెళుతున్నారని తెలిసి నాకు మళ్లీ అమ్మ జ్ఞాపకం వచ్చింది. నాకూ వెళ్లాలనే కోరిక కలిగింది. నాన్నగారితో "నన్ను కూడా వెంట తీసుకెళ్లండి" అన్నాను.

"నువ్వు బాపూ అనుమతి తీసుకో" అన్నారు నాన్నగారు. బాపూతో నడకకు వెళ్లే డ్యూటీ నాకు ఉండనే ఉంది. సాయంత్రం బాపూని "బాపూజీ! మా అమ్మకు జబ్బుగా ఉంది. మీరు నాన్నగారికి అక్కడికి వెళ్లడానికి అనుమతి ఇచ్చేశారు. నాకు కూడా అనుమతి ఇప్పించితే నేను కూడా వారితో వెళ్లి వస్తాను. వారితో కలిసి తిరిగి వచ్చేస్తాను" అని అడిగాను.

"నువ్వు తిరిగి అయితే వస్తావు - అందులో సందేహం కూడా లేదు. కానీ ఒకటి నువ్వు ఒక సంవత్సరం వరకూ ఇక్కడ ఉంటానని సంకల్పం చేసుకొన్నావు. సంకల్పాన్ని మధ్యలో ఉల్లంఘించకూడదు. అదే కదా గీటురాయి. కఠిన పరిస్థితిలో కూడా దానిని పాటించడం సంకల్పానికి సరైన అర్థం.

రెండవ విషయం, నువ్వు ఆశ్రమంలో వస్తూపోతూ మధురమైన కంఠంతో గీతాలు, భజనలు పాడుతూ ఉంటావు. నిర్దోషమైన నీ నవ్వులు వినపడుతూ ఉంటాయి. నువ్వు వెళ్లిపోతే మధురకంఠంతో పాడే భజనలు నాకెలా వినిపిస్తాయి? నీ నిర్మలమైన నవ్వు నాకు వినడానికి ఎక్కడ దొరుకుతుంది?

మూడో మాట, నువ్వెళ్లిపోతే ఉదయం సాయంత్రం నడిచేటప్పుడు నాకు బతికి వున్న చేతికర్రగా ఎవరుంటారు? కర్రలేక ఒకవేళ నేను పడిపోతే? చెప్పు ఇక నేను నువ్వు వెళ్లడానికి అనుమతి ఎలా ఇస్తాను? మీ నాన్నగారిని వెళ్లనివ్వు. అమ్మను గురించి చింతించకు. నువ్వు ఒక ఏడాది పూర్తికానియ్! అప్పుడు నువ్వు కోరితే నేను నిన్ను ఎవరితోనైన వెంటపెట్టి మీ అమ్మ వద్దకు తప్పకుండా చేరుస్తాను".

బాపూ ఎంత ప్రేమగా చెప్పారంటే, విని నేను ఆశ్చర్యపోయాను.

"మీరంతా నన్ను బాపూ అంటారు బాగుంది. ఎందుకంటే నేను పురుషుణ్ణి గనుక. నేను పురుషుణ్ణయినా సరే నేను తల్లిని కాక తప్పదు. ఆమెకే కరుణతో నిండిన హృదయం వరంగా లభించింది. నా హృదయం కూడా మాతృహృదయం లాగే కరుణతో నిండిపోవాలని నా కోరిక. నేనలాంటి హృదయం పొందడానికి ప్రయత్నిస్తూ ఉంటాను. ఈరోజు కాకపోతే రేపైనా నా హృదయం మాతృహృదయం అవ్వాలని ప్రయత్నిస్తాను" అన్నారు బాపూ.

మాతృప్రేమతో నిండిన బాపూ హృదయం అనుభవం పొందడం, నేనేమిటి నా వయస్సులో ఉన్న బాలికలు, బాలురు అక్కడికి వచ్చినవారందరికీ బాపూ మాతృస్నేహం లభించింది. వారంతా తమ తల్లిదండ్రులను కూడా మరచిపోయారు.

కాస్త ఆలోచించండి. నాలాంటి – 12 ఏళ్ల పరాయి ప్రాంతపు బాలిక 1200 కిలోమీటర్ల దూరం నుండి వచ్చి బాబూతో ఉంది. అక్కడ ఉండడం గురించి బాపూ అడిగిన మీదట "కేవలం ఒక్క సంవత్సరం ఉంటాను. తరువాత మా అమ్మ వద్దకు పంపించేయండి" అన్న బాలికకు బాపూతో ఉంటూ ఏళ్లు గడిచిపోయాయి. ఒక సంవత్సరం ఎప్పుడు గడిచిపోయిందో, దాని ధ్యాసే రాలేదు. దాని రహస్యం ఏమిటి?

దాని రహస్యం – బాపూలోని మాతృస్నేహం.

"ఇందులో ఏముంది? చివరకు నేను తల్లిని కావలసిందేగా! ఆ బాలిక తల్లి అయితే ఎన్నో ఏళ్ల క్రితమే మరణించింది. తల్లి స్నేహాన్ని అనుభవించలేదు. ఆమె చెవిలో చాలా నొప్పి పుడుతోంది. అందుకే అరుస్తోంది. నేను విన్నాను – నెమ్మదిగా వచ్చేశాను. మీరంతా కూడా రోజంతా చేసిన పరిశ్రమతో అలసిపోయారు. అందువల్ల గాఢనిద్రలో ఆమె అరుపులు వినలేకపోయారు" బాపూ అన్నారు.

ఆ బాలిక మరాఠీ పిల్ల. పేరు శరద్. దాదాపు 14 ఏళ్ల వయస్సు ఉంటుంది. ఆమె చెవిలో చాలా బాధగా ఉండేది. ఆమె తండ్రి పార్నేకర్‌జీ గొప్ప భక్తుడు. బాలిక తన తండ్రి నాయనమ్మలతో కలిసి ఉండేది. బాపూ తన కుటీరం వద్ద రెండవ కుటీరంలోనికి రప్పించుకొన్నారు. రాత్రి బాధతో అరుపులు విని బాపూ ఆ బాలిక వద్దకు వెళ్లి ఆమె మంచం మీద కూర్చొన్నారు. శుశ్రూష చేయసాగారు. కొంచెం సేపైన తరువాత పార్నేకర్‌జీకి మెలకువ వచ్చింది. బాపూ కూర్చుని కుమార్తెకు సేవ చేయడం చూశారు. పార్నేకర్‌జీ లజ్జితులయ్యారు.

### హరిజన కళ్యాణానికి బాగా పనికొస్తుంది

1944 నాటి నా పెండ్లి సంగతి. శ్రీమతి సరోజినీ నాయుడు నన్ను చాలా ప్రేమించేవారు. నాపెళ్లప్పుడు ఆమె సేవాగ్రామంలోనే ఉన్నారు. నేను నగలు ధరించే దానిని కాదని తెలిసిన సరోజినీ దేవి (ఆమెను నేను 'అత్తా' అని పిలిచేదాన్ని) బాపూతో "బాపూ! ఆభా ఎంత అందంగా ఉంది? ఏ నగలూ లేకుండా, ఏ అలంకారం లేకుండా ఎక్కడయినా వివాహం బాగుంటుందా? మీరు ఒకవేళ అనుమతిస్తే నేను ఆభాను బాగా అలంకరిస్తాను" అన్నారు.

బాపూ "నేను పేదవాడిని. నా దగ్గర నగలెక్కడున్నాయి?" అన్నారు.

"కానీ నేను మిమ్మల్ని నగలెక్కడ అడుగుతున్నాను? నేను పువ్వులతోనే అలంకరిస్తాను'' అన్నారు శ్రీమతి నాయుడు.

"అలాగే – నాకు తెలుసు ఆభా అంటే నీకెంత ప్రేమో! అందువల్ల వివాహ సమయంలో పువ్వులతో అలంకరించడానికి నేను అనుమతిస్తున్నా" అన్నారు బాపూ.

అనుమతి లభించగానే అత్త సంతోషించారు. ఆమె ఆశ్రమ బాలికలను పువ్వులు పోగెయ్యమని చెప్పారు. ఇంతలోనే ఒక బాలిక పరుగెత్తుకుంటూ వచ్చి ''బాపూ మిమ్మల్ని ఇప్పుడే రమ్మంటున్నారు" అని చెప్పింది. అత్త ఇది వినగానే బాపూజీ కుటీరానికి వెళ్లింది.

''ఔను, నీకు ఆభాను పూలతో అలంకరించేందుకు అనుమతి ఇచ్చేశాను. కానీ కేవలం కిందపడిన పువ్వులతోనే అలంకరించాలి" అన్నారు బాపూ.

నిజంగానే ఆమె రాలిన పువ్వులతోనే అలంకరించారు.

నా పెండ్లికి లక్ష్మీనివాస్ బిర్లాజీ నాకోసమని ఒక విలువైన నెక్లెస్ తీసుకొచ్చారు. వారు ఆ హారాన్ని బాపూ చేతులలో పెట్టారు. అది చూడగానే "నువ్వు ఈ నెక్లెస్ ధరింపజేసి ఆభా మెడరకు 'పట్టా' కట్టాలనుకుంటున్నావా? ఈ నెక్లెస్ నాకిచ్చేసెయ్! హరిజన కళ్యాణానికి బాగా పనికొస్తుంది" అని నవ్వుతూ సేఠ్ లక్ష్మీనివాస్ నుండి హారం తీసుకొన్నారు బాపూ.

కాసేపయిన తర్వాత బిర్లా గారితో బాపూ ''పెళ్లిలో ఎవరికీ ఏమీ ఇవ్వకూడదు. కానీ నీకు ఆభా, కనూల మీద చాలా ప్రేమ గనుక కేవలం నీకు మాత్రం వారికి ఏమయినా ఇవ్వడానికి అనుమతిస్తున్నాను. ఆ ఇంకోసంగతి జ్ఞాపకం ఉంచుకో. కనుకి రూపాయల

అవసరం లేదు. ఇవ్వాలంటే ఆభాకే ఇవ్వండి'' అన్నారు. బిర్లాగారు తన గదిలోకి వెళ్లి నా పేరున చెక్ రాసి తెచ్చి బాపూజీకి ఇచ్చారు. బాపూ అది నాకు ఇచ్చేశారు.

**పొదుపు - స్వచ్ఛత**

బాపూ ప్రతి సోమవారం మౌనవ్రతం పాటించేవారు. వారికి ఏదైనా అవసరం కలిగినప్పుడు లేక ఏదైనా అవసరమైన సూచన ఇవ్వవలసి వచ్చినప్పుడు కాగితం ముక్క మీద రాసి చెప్పేవారు. కాగితం ముక్క కూడా కొత్తదో లేక ఖాళీగా ఉన్నదో కాదు. ఆయనకి వచ్చిన ఉత్తరాలను తెరచి లోపల రాయని చోట, లేక ఖాళీగా ఉన్న చోట, లేక కవర్లు విప్పి వాటి లోపి భాగం పైన ఏమీ రాయకుండా లేక ముద్రలు లేకుండా ఉన్నచోటే రాసేవారు.

బాపూ ఓ రోజు పాయఖానా (టాయిలెట్) నుంచి చాలా ఆలస్యంగా బయటకొచ్చారు. అందువల్ల నేను భయపడ్డాను. సహజంగానే "బాపూజీ! ఇవ్వాళ మీకు పాయఖానాలో చాలా సమయం పట్టింది. కడుపులో బాధ ఏమీ లేదు కదా?'' అని అడిగా.

"లేదు – కడుపులో బాధేమీ లేదు. నేను లోపలికి వెళ్లగానే – నాకంటే ముందు పాయఖానాకు వెళ్లిన సోదరుడికి కడుపులో బాధ ఉండి ఉంటుంది. అందువల్ల ఆయన మలపు చినుకులు పాయఖానా నలువైపులా పడి ఉన్నాయి. ముందు అదంతా శుభ్రం చేశాను. తరువాత నేను ఉపయోగించాను. అందుకనే చాలా సమయం పట్టింది'' అన్నారు బాపూ.

"పాయఖానా మీరు ఎందుకు శుభ్రం చేశారు. మీరు మమ్మల్ని పిలవాల్సింది. మీకెంతో సమయం కలిసి వచ్చేది'' అన్నాను నేను. "నువ్వు చెప్పింది బాగానే ఉంది. కానీ పాయఖానాకు వెళ్లేటప్పుడు నేను చూసిన అపరిశుభ్రత, దానిని శుభ్రం చేయడానికి ఎవరినైనా పిలవడం మంచిది కాదు, శోభాస్పదం కాదు. ఇదేవో ఒక కారణం. నిన్ను పిలవకపోవడానికి రెండో కారణం కూడా ఉంది. పాయఖానా నేను శుభ్రం చేసుకున్నాను. అందువల్ల ఇక నుండి ఇదో రివాజు అయిపోతుంది. పాయఖానాను ఎవరు ఉపయోగిస్తారో దానిని వారే శుభ్రపరచి రావాలి. ఈ సూత్రం చెప్పడం వల్ల లేక ఒక కాగితం మీద రాసి పాయఖానాకు వేలాడదీసినా ఏమీ లాభం ఉండేది కాదు. ఇవాళ నా చేతులతోనే శుభ్రపరిచాను అనే సంగతి ఆ సోదరుడు, ఉపయోగించే ఇతరులందరికీ తెలిసిపోతుంది. మరి చెప్పకుండానే ఈ సూత్రాన్ని పాటించడం ప్రారంభమవుతుంది. అది శుభ్రం చెయ్యడం కోసం నువ్వు ఒక బ్రష్‌ని వేలాడదీయాల్సి ఉంటుంది. ఈ విధంగా అసలు నేను నా సమయాన్ని పొదుపే చేశాను'' బాపూ విస్తారంగా అర్థమయ్యేలా వివరించారు.

బాపూ మాట నిజమయింది. బాపూ ఇచ్చిన సూచన ప్రకారం అక్కడ బ్రష్ తగిలించబడింది. దీని తరువాత ఆ పాయఖానాను ఎవరు ఉపయోగించినా దానిని బాగా శుభ్రపరిచిన తరువాతే బయటకొచ్చేవారు. అప్పటి నుండి ఆ పాయఖానా ఎల్లప్పుడూ శుభ్రంగా మెరుస్తూ కనిపించేది.

బాపూకి అన్ని పనులూ శుభ్రంగా స్వచ్ఛంగా ఉండడం ఇష్టం. ఆశ్రమంలో మేము పాయఖానాలో బకెట్టు ఉపయోగించేవాళ్లం. రోజూ దానిని నీటితో శుభ్రంగా కడిగి ఎండలో పెట్టేవాళ్లం. ఆశ్రమంలోకి కొత్తగా వచ్చినవారు బాల్చీలను సరిగ్గా శుభ్రపరచిందీ లేనిదీ స్వయంగా బాపూ చూసేవారు. బాగా శుభ్రం చేయడం అలవాటయిపోయిన తరువాత బాపూ చూడడం మాని వేసేవారు. ప్రారంభంలో బాపూజీకి శుభ్రత అంటే ఇంత పట్టుదల అని మాకు తెలియదు. బాపూ ఘ్రాణేంద్రియం పూర్తిగా పనిచేయడం లేదని తెలుసు. అందువల్ల వారికి చెడువాసన రాదనుకునేవారం. అయినా గానీ ప్రారంభంలో బాపూ ఏదో ఒక లోటును చెబుతూ ఉండేవారు. "దీని నుండి చెడు వాసన వస్తోంది'' అనేవారు. ఇది విని మాకు ఆశ్చర్యం వేసేది. బాపూ సూక్ష్మదృష్టిని చూసి ఒకసారి మేము "మీ ఘ్రాణేంద్రియం అయితే పనిచేయదు. అయినా గానీ మా ఈ పని వల్ల చెడ్డ వాసన వస్తోందని మీకెలా తెలిసిపోతుంది'' అని బాపూని అడిగాము.

దీనికి జవాబిస్తూ బాపూ "మీమాట పూర్తిగా వాస్తవమే! ప్రకృతి నియమం ఏమిటంటే ఏ వ్యక్తికి అయినా ఒక ఇంద్రియం పనిచేయకపోయినట్లయితే – అతని మిగతా ఇంద్రియాలు ఎక్కువ పనిచేస్తాయి. మీరు గుడ్డివాళ్లను చూసే ఉంటారు. వారు నెమ్మదిగా తమ మార్గంలో నడుస్తూ వెళుతుంటారు. ఈశ్వరుడు వారికి కన్నులు ఇవ్వలేదు. అందువల్ల వారి స్పర్శశక్తి తీవ్రం చేశాడు. నాదికకూడా సరిగ్గా అలాంటి స్థితే! నా ఘ్రాణేంద్రియం పని చేయదు. అందువల్ల ఈశ్వరుడు నా దృష్టిని సూక్ష్మం చేశాడు. అంత చిన్న అంశం కూడా నా దృష్టిని తప్పించుకోలేదు. ఈ శక్తి వల్లే నేను శుభ్రత పనులలో సరిగా చూడగలుగుతాను. మరప్పుడు దీనివల్ల ఇంత దుర్గంధం

వ్యాపిస్తుందని అంచనా వేస్తాను. ఇందులో ఆశ్చర్యకరమైన విషయం ఏమీ లేదు. అర్థమయిందా?" అని చెప్పి మా సందేహం నివృత్తి చేశారు.

**అతిథి దేవోభవ**

''నా కమోడ్ ఆయన గదిలో ఉంచండి'' అని బాపూ తరచూ చెబుతుండేవారు.

అనేకమంది యూరప్ దేశస్తులు కూడా బాపూజీని కలుసుకోవడానికి సేవాగ్రామ్ వస్తుండేవారు. అక్కడ ఫ్లష్ సౌకర్యం ఉండే పాశ్చాత్య తరహా పాయఖానా వ్యవస్థ లేదు. ఒక చెక్క పెట్టెకు మధ్యలో గుండ్రంగా రంధ్రం చేసి బాపూజీ కోసం కమోడ్ తయారుచేశారు. ఆ కమోడ్‌ని విదేశీయుల సౌలభ్యం కోసం వారు బస చేసే చోట పెట్టించేవారు బాపూ.

బాపూజీని కలవడానికి నెహ్రూ నౌఖాలీ వచ్చారు. ఆయన కోసం కూడా బాపూ తన కమోడ్‌నే పెట్టించారు. అది చూసిన పండిట్‌జీ కోపంతో "ఇదేంటి? బాపూది పెద్దమనసే కావచ్చు. కానీ మనం ఆయన వయస్సును గౌరవించాలి కదా! ఆయనకి కమోడ్ లేకపోతే చాలా ఇబ్బందవుతుంది. అది మనం ఆలోచించాలి. దీన్ని ఎక్కడి నుంచి తెచ్చారో అక్కడ పెట్టెయ్యండి" అన్నారు.

"కానీ దీన్ని మీ కోసం పంపించారు. తిరిగి తీసుకెళ్తే బాపూజీకి మాపై కోపం వస్తుంది" అన్నాము.

అది వినగానే నెహ్రూ "అలా అయితే బాపూ ఎవరి కోసమైతే దీనిని పంపించారో వారే దీనిని వెనక్కి పంపించారని, ఆయనకి దీనితో అవసరం లేదని చెప్పండి. నేను వయసులో ఉన్నాను. నాకు దీని అవసరం పడదు. నేను ఎటువంటి పరిస్థితులకైనా సర్దుకుపోయే అలవాటు ఉన్నవాడిని" అన్నారు. ఆ మాటలు విన్నాక ఇక కమోడ్‌ని బాపూ దగ్గరికి తిరిగి తీసుకుకపోక తప్పలేదు.

బాపూ కారణం అడిగినప్పుడు మేము పండిట్‌జీ చెప్పిన మాటలే చెప్పాం. అది విన్న బాపూ "జవహర్ ఏమైనా జవహరే" అన్నారు. అంటే దీనర్థం బాపూ ప్రతి ఒక్కరి గురించీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. వారికి అవసరమైన సౌకర్యం కల్పించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఒకవేళ అందుకు అవసరమైన ఏదైనా వస్తువు లభ్యం కాకపోతే బాపూ తన సొంత వస్తువులిచ్చి అతిథులకు సౌకర్యం కల్పించడం పట్ల శ్రద్ధ చూపేవారు.

**ఎంతో నిరాశ ఉన్నా నెహ్రూ కోసం నవ్వు పులుముకుంటున్నానన్న బాపూ**

స్వాతంత్ర్యం వచ్చిన తదుపరి సంఘటన ఇది. దేశానికి స్వతంత్రం వచ్చినా ఎందుకో బాపూ ముఖం మీద నిరాశ వ్యాపించి ఉంటోంది.

ప్రధాని నెహ్రూ సలహా సంప్రదింపుల కోసం బాపూ వద్దకు వచ్చేవారు. వారొచ్చినప్పుడు బాపూ వారికి వేడినీళ్ళు, తేనె, నిమ్మరసం, షర్బత్ ఇవ్వమని ఆదేశించి ఉంచేవారు. మేము వారు రాగానే షర్బత్ తయారుచేసి ఇచ్చేవాళ్లం. ఆయన సంతోషంగా తాగా బాపూని ఆనందపరిచేవారు.

నెహ్రూ గారు అలసిపోయి వచ్చేవారు. అందువల్ల ఆయనకు షర్బత్ ఇవ్వడంలో కారణం నేను అర్థం చేసుకున్నా కానీ ఒక్క సంగతి నాకర్థమయ్యేది కాదు. రోజంతా విచారంగా ఉండే బాపూ ముఖంలో నెహ్రూ గారు రాగానే ఇంత ఆనందం ఎలా వచ్చేదా అని. నేను ఒకరోజున బాపూని దీనికి కారణం అడిగాను. ''బాపూ! ఈమధ్య మీరు రోజంతా చాలా విచారంగా ఉంటున్నారు. ముఖం మీద నిరాశ వ్యాపించి ఉంటోంది. నవ్వడం లేదు. హాసపరిహాసాలు కూడా మానేశారు. కానీ నెహ్రూగారు వస్తే మీరు నవ్వుతున్నారు. ఆనంద మగ్నులవుతున్నారు. దీని క్కారణం నాకు అర్థం కాలేదు. అందుకే అడుగుతున్నాను".

బాపూ వెంటనే జవాబిచ్చారు. "నీ మాట పూర్తిగా నిజం! నా నవ్వు ఒక్కసారిగా ఎండిపోయింది, పారిపోయింది అంటున్నావే అదీ నిజమే! కానీ పిచ్చిదానా నువ్వు ఈ మాత్రం కూడా అర్థం చేసుకోలేవా? అతడెంత బరువు మోస్తున్నాడు? అతడెంత చింతిస్తూ ఉంటాడు? అలాంటి జవహర్ నా వద్ద తన కష్టాలను, తన బాధలను చెప్పుకొని సలహాలు తీసుకోవడానికి వస్తే అప్పుడు నేను కూడా నవ్వక గంభీరంగానే ఉంటే నా గాంభీర్య ముఖం చూసి పాపం అతను చచ్చేపోతాడు. అతడి రాజ్యంలో బాపూజీకే ఇంత మానసిక కష్టం కలుగుతుంటే, అతడు మానసిక శాంతిని చేకూర్చ లేకపోతే, తను భారతదేశపు ప్రధాన మంత్రి పదవిలో ఉండడంలోని అర్థం ఏమిటని ఆలోచిస్తాడు. అందుకే జవహర్ వచ్చినప్పుడు నేను నా చెంపలను వాయించుకొని నా బుగ్గలను ఎర్రగా ఉంచడానికి ప్రయత్నిస్తాను. అర్థమయిందా?" అని బాపూ ప్రేమతో నా చెవి మెలివేశారు.

**నిద్ర మీద అంత నియంత్రణ**

మౌలానా! నేను కాస్త అలసిపోయాను. మీరు కాస్త త్వరగా వచ్చారు. ఇంకా నాలుగైదు నిముషాలు మిగిలివున్నై. అనుమతిస్తే నేను కాస్త

విశ్రాంతి తీసుకుంటాను'' అన్నారు బాపూ.

''నిస్సంకోచంగా విశ్రాంతి తీసుకోండి'' మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అన్నారు.

బాపూ పడుకున్న మరుక్షణంలో గాఢనిద్రలోకి పోయారు. గురక కూడా రాసాగింది. ఇది చూసి మౌలినా గారు ఆశ్చర్యపోయారు. ఆయన ఇంతకంటే ఎక్కువ ఆశ్చర్యపడిందెప్పుడంటే, బాపూ సరిగ్గా నాలుగు నిముషాల తరువాత ఎవరూ లేపకుండానే తనంతట తానే లేచి కూర్చోగానే. "మౌలానా సాహెబ్! మీ విషయాలు ఇప్పుడు చెప్పండి. నేను ఇప్పుడు పూర్తి సావధానంగా ఉన్నాను" అని బాపూ అన్నారు.

"బాపూ! నిద్ర మీద కూడా మీకింత నియంత్రణ చూసి నేనాశ్చర్యపోయాను. ఒక్క క్షణంలో మీరు గాఢ నిద్రపోయారు. మీ అంతట మీరే సరైన సమయానికి లేచిపోయారు కూడా" అన్నారు మౌలానా.

"దీనిని కూడా ఈశ్వరుని దయే అనుకుంటాను" అన్నారు బాపూ. నిద్ర మీద కూడా చిత్రమైన నియంత్రణ ఆయనకి ఉంది.

### కోపగించుకునే అధికారం లేదు

ఈ విషయం 1946 నాటిది. తూర్పు బెంగాల్‌లోని నౌఖాలీలో వైషమ్యాల వల్ల హిందువులపై రకరకాల దుండగాలు జరిగాయి. దాదాపు మొత్తం హిందువులంతా భయపడి కలకత్తా వెళ్లిపోయారు. ఆ రోజులలో బాపూ ఢిల్లీలో ఉన్నారు. ఈ వార్త వినగానే బాపూ అక్కడికి వెళ్లి హిందువులకు నచ్చచెప్పి రెండు మతాలవారిలో శాంతిని సోదరభావాన్ని స్థాపించడం తన ధర్మమనుకున్నారు. బాపూ నౌఖాలీ చేరారు. బాపూని కలుసుకోవడానికి ముస్లిం సోదరులు చాలామంది వచ్చేవారు. ముస్లిం మహిళలు బాపూని కలుసుకోవడానికి ఎలా రాగలరు? ఒక రోజున ఒక పెద్దింటి సోదరీమణులు నాతో "గాంధీ గారి దర్శనం మేము చేసుకోవాలనుకుంటున్నాం. వారు ఇక్కడికి వస్తారా ఏం?" అన్నారు.

నేను "తప్పకుండా వస్తారు" అన్నాను. ''అయితే వారి నొకరోజు ఇక్కడికి తీసుకురండి'' వారు బలవంతపెడుతూ అన్నారు.

నేను బాపూజీకి ఇది చెప్పాను. రెండవరోజు ఉదయం వ్యాహ్యాళికెళ్లినప్పుడు ఆ ఇంటి ముందు నుండి వెళ్లాలని నిర్ణయం జరిగింది. నేనీ వార్తను ఆ సోదరీ మణులకు చెప్పివచ్చాను.

రెండవరోజు బాపూ వ్యాహ్యాళికి వెళ్లేటప్పుడు ఆ సోదరీమణుల ఇంటికి వెళ్లారు. వరండాలో బాపూని ఒక కుర్చీలో కూర్చోబెట్టి నా సోదరీమణులను పిలవడానికి వారింటికి వెళ్లాను. "మీరు గాంధీ గారిని కలుసుకుంటామన్నారు గదా, వారు వచ్చేశారు. రండి నేను మిమ్మల్ని వారికి పరిచయం చేస్తాను" అని ప్రతి ఒక్కరికీ చెప్పారు.

ఆ సోదరీమణులు దర్వాజా దాకా వచ్చారు. కానీ తిరిగి లోనికి వెళ్లి పోయారు. ఇది నాకు చాలా చెడ్డగా తోచింది. నేను కోపగించుకుని వారితో "ఇదేమి తమషా? మీరు చెప్పిన మీద నేను గాంధీగారిని ఇక్కడికి తీసుకొచ్చాను. కానీ మీరు బయటకే రావడం లేదు. గాంధీ గారికి అనవసరంగా ఇక్కడికి వచ్చే కష్టం కలిగించాను" అన్నాను. ఇది విని బాపూ నాపై కోపగించుకొని "ఇలా మాట్లాడే అధికారం మనకు లేదు. మనం వారి ఇబ్బందులు అర్థం చేసుకోవాలి. ఈ సోదరీమణులు కలుసుకో గోరుతుండవచ్చు. కానీ పురుషులు నిషేధించి ఉంటారు. పాపం వాళ్లేం చేయగలరు? రెండు సంప్రదాయాల లోనూ శాంతిని స్థాపించడానికి మనం నౌఖాలీ వచ్చాము. మనం ప్రతి మాటా శాంతియుతంగా ప్రేమగా మాట్లాడాలి. నువ్వు వెళ్లు – వారందరికీ వాళ్లు మళ్లీ ఎప్పుడైనా కలుసుకోవాలనుకుంటే నీతో చెప్పమని ప్రేమగా చెప్పు. నేను మళ్లీ అవశ్యం ఇక్కడికి వస్తాను" అన్నారు.

బాపూ ఇచ్చానుసారంగా నేనా సోదరీమణులకు చెప్పివచ్చాను. నేను ఆ ఇంటిలో సందిగ్ధంలో ఉన్న ముస్లిం సోదరులపై దీని వల్ల మంచి ప్రభావం పడడం చూశాను.

### పరుల దు:ఖం వల్ల దు:ఖితుడు

"కాస్త వర్షం రాగానే నా పక్కను లోపల గదిలోకి తీసుకువెళుతున్నావు. నాకు మంచి ఏర్పాటై పోయింది. నేను విశ్రాంతిగా పడుకుంటాను కూడా! కానీ నాకు నిద్ర రాదు. ఎలా వస్తుంది? నాకు పాకిస్తాన్ నుంచి ఇక్కడకు వచ్చిన వారిని గురించి చింత. పాపం వాళ్లెక్కడకు వెళతారు? ఎక్కడ నిద్రపోతారిలాంటి వర్షంలో? ఆ తల్లుల పరిస్థితి ఎలా ఉంటుంది? తమ చిన్నచిన్న కోమలమైన శిశువులను తమ ఒడిలో పెట్టుకుని నిద్రించేవారేం కావాలి? వారి కోసం గుడారాలైతే వేశారు. కానీ వాటిలో ఎంతమందికని ఆశ్రయం లభిస్తుంది? కష్టం మీద లక్షా రెండు లక్షలకు కాస్త ఆశ్రయం లభించి ఉండొచ్చు. కానీ మిగతా కోట్లాది ప్రజల గతేం కాను! వారికి పైన ఆకాశం, కింద నేల! ఇది తప్ప వాళ్లకు వేరే దిక్కేమిటి!" బాపూ దు:ఖంతో అన్నారు.

బాపూ ఎల్లప్పుడూ ఆరు బయట ఆకాశం కిందే పడుకునే వారు. కాసిని చినుకులు పడితే వారి పక్కను లోపలకు తీసుకెళుతున్నప్పుడు పై మాటలు అన్నారు.

కరుణామూర్తి బాపూ వ్యధిత హృదయాన్ని ఎవరైనా తేలికగా ఊహించగలరా! వారికి ఆ రోజున లోపలికి వెళ్లిన తరువాత కూడా నిద్ర రాలేదు.

"వైష్ణవ్ జన్ తో తేనే క హియే

జే పీడ్ పరాయీ జాణేరే!"

(ఇతరుల దు:ఖాన్ని ఎరిగిన వారినే వైష్ణవుడంటారు)

బాపూ ప్రతిక్షణం ఇతరుల కష్టాల గురించి ఆలోచించేవారు. వారు నిజమైన అర్థంలో "వైష్ణవులు".

"ఆభా! విషయం ఏమిటి ఈరోజు ఉదయం నుండే నువ్వు చాలా విచారంగా ఉన్నావు. నిద్రపట్టలేదా ఏం?" అన్నారు బాపూ ప్రశ్నార్థకంగా.

"బాపూ! శరీరం ఆరోగ్యంగా ఉంది గానీ రాత్రి మంచి నిద్ర రాలేదు" అన్నాను నేను.

''దానికి కారణం ఏదైనా చింతాఏం?" బాపూ అడిగారు.

"బాపూ! నిన్న రాత్రి బిర్లాహౌస్ ఎదుట ఉన్న అతిథి గృహం నుంచి నా చిన్నపెట్టె మాయమయింది. అందుకే బాధపడుతున్నాను" నేను అసలు కారణం చెప్పాను.

"ఓహో అంతేకదా. దీనికే ఇంత బాధపడవలసిన అవసరం ఏముంది? చింతను తగ్గించుకునే ఉత్తమమైన వైద్యం చెప్పనా! నిజమైన ఉత్తమ చికిత్స ఏమిటంటే మనది పోయిన దానికంటే ఎక్కువ పోయిన వాళ్ల గురించి ఆలోచించు. దానికి జ్ఞాపకం చేసుకోగానే మన దు:ఖం సమాప్తమైపోతుంది. నువ్వైతే చూస్తూనే ఉన్నావుగా. దేశ విభజన తరువాత పాకిస్తాన్ నుండి కోట్లాది జనం తమ ఇళ్లను, సంపదను, విలువైన నగలను ఇంకా మనకు తెలియనివి ఎన్నో విడిచిపెట్టి ఇక్కడకు వచ్చారు. కుటుంబసభ్యులను కూడా విడిచిపెట్టి వచ్చారు. వాళ్లు ఎంత దు:ఖిస్తూ ఉంటారు! ఇది ఆలోచించు, వారి దు:ఖాన్ని గురించి యోచన చెయ్యి. వాటితో పోలిస్తే నీదేమీ పోలేదన్నమాటే! ఈ విధంగా నువ్వు ఆలోచించడం ప్రారంభించు. నీ చింత మటుమాయమవుతుంది'' అన్నారు బాపూ.

## ఆకాశవాణి నుండి సందేశం

మీరు ఆకాశవాణిలో శాంతి సందేశం ఇస్తే బాగుంటుందని 1947లో బాపూతో అన్నారు. "దీని అవసరం ఏమిటి? ప్రార్థన తరువాత మాట్లాడినది రేడియోలో వస్తోంది గదా! మళ్లీ దాని అవసరమేముంది?" అంటూ బాపూ ఆ విషయాన్ని దాటవేశారు.

"కానీ బాపూ. మీకు తెలుసా? మీ శాంతి సందేశం విని కోట్ల కొలది నిరాశ్రయులకు ఎంత శాంతి కలుగుతుందో! మీరు ఆకాశవాణిలో మాట్లాడితే ఈ విషయం ముందే అందరికీ చెప్పేస్తాము. అందువల్ల కోట్లాది ప్రజలు మీ వాణిని వినగలుగుతారు" ఘన్‌శ్యామ్ దాస్ బిర్లా అన్నారు.

"అలాగా మంచిది. నా కంఠంతో సానుభూతిపూర్వకమైన మాటలు వింటే లక్షల, కోట్ల శరణార్థులకు శాంతి లభిస్తే, వారికి ఎక్కువ ఆశ్వాసం లభిస్తే నేను తప్పకుండా రేడియోలో మాట్లాడడానికి సిద్ధంగా ఉన్నాను'' అని బాపూ ఆకాశవాణిలో మాట్లాడడానికి వెంటనే ఒప్పుకుంటూ అన్నారు.

## అనుచిత లాభం వద్దు

1947. బాపూ ఢిల్లీలో ఉన్నారు. వారు ఉండడానికి బిర్లా భవనంలో ఏర్పాటు చేశారు. బాపూ కోసం ఒక పెద్ద గది, వరండా, స్నానగృహం, శౌచాలయం ఏర్పాట్లు చేశారు. ఒక రోజున నలుగురైదుగురు కార్యకర్తలు బాపూతో కొద్దిరోజులు ఉండడానికి వచ్చారు. వాళ్లు వంతులవారీగా స్నానం చెయ్యడానికి వెళ్లేవారు. అందువల్ల నేను సరైన సమయానికి స్నానం చేయలేక పోయాను. బాపూజీకి భోజన సమయం కావొస్తోంది. నేను చింతాక్రాంతురాలనయ్యాను. వంటింటిలోకి వెళ్లి నిలబడి ఉన్నాను. ఆ సమయంలో ఏదో పని మీద సరళా సోదరి అక్కడికి వచ్చింది. నేను విచారంగా ఉండడం చూసి భయపడింది. "బాపూ భోజనం సరిగ్గా తయారుకాలేదా? ఆలస్యమయిందా? మీరు ఎందుకు చింతిస్తూ నిలబడ్డారు?'' అని నన్ను అడిగింది.

"బాపూ భోజనమయితే తయారై పోయింది. బాగానే ఉంది. కానీ గాంధీజీకి భోజనం ఎలా పెట్టనా అని చింతిస్తున్నాను. కస్తూర్బా స్నానం చెయ్యకుండా ఆయనకు భోజనం వడ్డించవద్దని పట్టుపట్టేవారు. నేనింకా స్నానం కూడా చెయ్యలేకపోయాను" అని విషయమంతా చెప్పాను.

''ఇందులో చింతించవలసిన విషయం ఏముంది? నా స్నానగృహం ఖాళీగానే ఉంది. అక్కడికొచ్చి స్నానం చెయ్యి!" సరళా సోదరి అన్నది. నేను నా

బట్టలు తీసుకొని బాపూతో "బాపూ! నేను స్నానం చేసి ఇప్పుడే వస్తాను. మీకు భోజనం పెట్టడానికి బహుశా పది నిముషాలు ఆలస్యం కావచ్చు క్షమించండి" అన్నాను.

"స్నానం చెయ్యడానికి ఎక్కడికి వెడుతున్నావు?" నా చేతిలోని బట్టలు చూసి బాపూ అడిగారు.

"సరళా సోదరి స్నానగృహానికి" అన్నాను.

"ఏం ఈరోజు అక్కడకెందుకు వెళ్లాలి?" అడిగారు.

"ఈరోజు ఇక్కడ చాలా గుంపు ఉంది. స్నానం చెయ్యడానికి నావంతు రాలేదు. ఎప్పుడొస్తుందో కూడా తెలియదు. మీకు భోజనం పెట్టే సమయం కావొస్తోంది. స్నానం చెయ్యకుండా మీకు భోజనం పెట్టవద్దని బా చెప్పివున్నారు. నేనిదే చింతిస్తూ ఉంటే సరళా సోదరి తన స్నాన గృహం ఖాళీగా ఉందని నన్ను అక్కడికే వచ్చి స్నానం చెయ్యమని చెప్పారు" అని వివరించాను.

ఇది వినగానే బాపూ "మనకెంత ఏర్పాటు లభించిందో అంతలోనే పని జరుపుకోవడం నేర్చుకోవాలి. మన ఇంటికి అతిథులు వస్తూనే ఉంటారు. కానీ మనమందరం సరైన సమయానికి స్నానం చేసి సిద్ధమై పోయే ఏర్పాటు చేసుకోవాలి. మనకు లభించిన ఏర్పాట్లకు మించిన ఏర్పాట్లు మనం తీసుకోకూడదు. బిర్లా కుటుంబం చాలా ఉదారమైనది. నేను కాస్త సైగ చేస్తే ఘన్‌శ్యామ్ దాస్ మొత్తం బిర్లా హౌస్ నాకప్పగిస్తారు. వెళ్లు, సరళకు ఈ విషయం అంతా చెప్పు. ఆమె నీ నిరీక్షణలో కూర్చొని ఉండి ఉంటుంది. నాకు ఆలస్యంగా భోజనం లభించినా ఏమీ నష్టం లేదు" అన్నారు.

నేను వెంటనే సరళా బెహన్ వద్దకెళ్లి మొత్తం విషయమంతా చెప్పేసరికి ఆమె నోటి నుండి "బాపూ – బాపూయే! మహాన్ ఆత్మ" అని వెలువడింది.

## విద్యోపార్జన మహత్తు

"నేను బెంగాలీ పాఠం నేర్చుకోవడం ఎలా మానగలను? అదైతే నాకు ఆహారం" అన్నారు బాపూ.

ఈ సంగతి 1946 నాటిది. బాపూ నౌఖాలీ వెళ్లారు. అప్పటి నుండి ఆయన బెంగాలీ నేర్చుకోవడం ప్రారంభించారు. అక్కడ ఆయన ప్రొఫెసర్ నిర్మల్ కుమార్ బసు వద్ద బెంగాలీ నేర్చుకునేవారు. కొన్ని నెలల తరువాత శాంతి కార్యం కోసం బాపూజీకి బీహార్, ఢిల్లీ వెళ్లవలసి వచ్చింది. నిర్మల్ కుమార్ బసును వెంట తీసుకురాలేదు. అందువల్ల బంగ్లా నేర్చుకునే క్రమం కుంటుపడింది. నేను నౌఖాలీ నుంచి ఢిల్లీ చేరాను. అప్పుడు బాపూ "నువ్వు బెంగాలీ బాలికవు గదా! నౌఖాలీ నుండి వచ్చాక బెంగాలీ నేర్చుకోవడం ఆగిపోయింది. ఇది నాకు బాధగా ఉంది. ఇప్పుడు నువ్వు వచ్చేశావు. నాకు బెంగాలీ నేర్పు" అన్నారు. ఇది విని నాకు చాలా సంకోచం కలిగింది. నేను "సరే" అనడానికి సందేహించాను. బాపూ "ఏం ఎందుకు మౌనం వహించావు? ఇందులో సందేహించాల్సినదేముంది? నేర్పడానికి సందేహించవలసిన అవసరం ఏమీ లేదు. నీవద్ద ఉన్న జ్ఞానాన్ని అందించడానికి సంకోచమెందుకు?" అని అడిగారు.

చివరకు నేను "సరే" అన్నాను. బాపూ రోజూ బెంగాలీ నేర్చుకోసాగారు. మధ్యమధ్యలో మతసామరస్యం కోసం ఆయన ఉపవాసాలు చేసేవారు. ఆ రోజులలో బెంగాలీ నేర్చుకోవడం ఆగిపోయేది. మిగతా ఏరోజూ ఆగేది కాదు ఆయన అభ్యాసం.

నాటి ఉదయం నుండే బాపూ చాలా వ్యస్తంగా ఉన్నారు. ఉపవాసం తరువాత శ్రమించారు. పూర్తిగా అలసిపోయినట్లు కనిపిస్తున్నారు. "ఈరోజు బెంగాలీ పాఠం నేర్చుకోకపోతే ఏం? కాస్త విశ్రాంతి తీసుకోండి" అన్నా. దాని మీద బాపూ వెంటనే "అదెలా సాధ్యం. అది నాకు ఆహారం. ఎంత అలసిఉన్నా సరే, లేక ఎంత వ్యస్తంగా ఉన్నా సరే బెంగాలీ పాఠం సాగవలసిందే! నీకు నా మీద దయకలిగింది. అందుకే నువ్వు ఇలా అంటున్నావు. నేను నీ మాటను అర్థం చేసుకోగలను. ఇందులో జాలి పడవలసిందేమీ లేదు. ఇదీ నాకు ఒక రకమైన ఆహారమే. దీనిని రోజూ నియమితరూపంలో తీసుకోవలసిందే!" అని పుస్తకం చదవడం ప్రారంభించారు.

బాపూ బెంగాలీ పాఠం చదవడంతోపాటు రాసేవారు కూడా. జనవరి 30 ఆఖరి రోజున కూడా బెంగాలీ పాఠాన్ని అభ్యాసం చేసి, చివరి వరకూ బాపూ విద్యార్థిగానే ఉన్నారు. ఆ విధంగా ఆయన ఒక ఆదర్శం విడిచి వెళ్లారు.


"బిడ్డ గర్భంలో ప్రవేశించినప్పటి నుండి జీవితమంతా విద్యార్థిగానే ఉంటాడు" అని తరచూ చెబుతుండేవారు బాపూ. ❐



గ్రామస్వరాజ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం గాంధీ నిరంతరం పోరాడారు. అధికారానికి పౌరుడు/పౌరురాలు, అతడు/ఆమె కుటుంబం కేంద్రబిందువుగా ఉండాలని ఆయన నిర్వంద్వంగా చెప్పేవారు. గ్రామం లేదా వార్డుస్థాయిలో పౌరులకు సాధ్యమైనంత చేరువగా అధికారాన్ని వినియోగించే వ్యవస్థ ఉండాలని గాంధీ ఎంతో ఆర్తితో పోరాడారు. పరిమిత ప్రభుత్వం, నైతిక రాజకీయాలను ప్రజాసేవకు మార్గంగా గుర్తించారు.

# మహాత్ముడి 5 ప్రజాస్వామిక సూత్రాలు

- డా॥ జయప్రకాష్ నారాయణ్




మహాత్మాగాంధీ మౌలికంగా ఐదు ప్రజాస్వామిక విలువలు, సూత్రాలకు ప్రాతినిధ్యం వహించారు.

మొదటిది, గాంధీ నైతిక రాజకీయాల కోసం నిలబడ్డారు. అధికారం.. ఒక లక్ష్యానికి మార్గమే తప్ప అంతిమం కాదు అని చాటి చెప్పారు. ప్రజాజీవితమంటే వ్యక్తిగత జీవితానికి కొనసాగింపేనని స్పష్టం చేశారు. చెప్పింది చేసి చూపారు.

రెండోది, అన్యాయాన్ని కొనసాగించే యథాస్థితిని ప్రశ్నించాలన్నారు. అయితే ఆ క్రమంలో సవాలు ఎటువంటిదైనా హింసకు, విద్వేషాలకు దిగజారకుండా సృజనాత్మక ఒత్తిడి (క్రియేటివ్ టెన్షన్)తో వాటిని అధిగమించే పరిపక్వ నాయకత్వ సామర్థ్యాన్ని ఆయన ప్రదర్శించారు. ఆ నైపుణ్యంతోనే గాంధీ రకరకాల నేపథ్యమున్న ప్రజలతో కూడివున్నప్పటికీ ఈ గడ్డ మీద గొప్ప దేశాన్ని నిర్మించారు.

మూడోది, అవకాశాలు అందరికీ అందాలని, ఏ తల్లి గర్భాన పుట్టినా ఎటువంటి వివక్షా ఉండకూడదని గాంధీజీ నిరంతరం చెప్పేవారు.

నాలుగోది, స్వాతంత్ర్యం అంటే కొందరు పెద్దలు గద్దెనెక్కి కూర్చోవడం కాదు.. ఈ దేశంలో చిట్టచివరన ఉన్న సామాన్య పౌరునికి తన జీవితం మీద తనకు సాధికారత, తన బతుకుకు తానే యజమానిననే విశ్వాసం కలిగించటమే నిజమైన స్వాతంత్ర్యం అని గాంధీజీ ప్రగాఢంగా నమ్మేవారు. అందుకే

ఐదవది, ప్రకృతితో సామరస్యంగా ఉంటూ అవసరానికి మించిన సంపదకు ధర్మకర్తలా వ్యవహరించాలని ప్రజలకు ఆయన బోధించేవారు.

కాలాతీతమైన, సార్వజనీనమైన గాంధీజీ విలువలు మనలాంటి విస్తృతమైన, సంక్లిష్టమైన, వైవిధ్యమైన, ప్రాచీనమైన సమాజానికి సరిగ్గా సరిపోతాయి.

...రాజకీయాలలో ఉన్నవారు, రాజకీయాలను ద్వేషించేవారు, పౌరసమాజం అందరూ ఈ గాంధేయ విలువలు, విధానాలను జీవితంలో భాగం చేసుకోవాలి. గాంధీని జాతిపిత అని పిలుచుకునే అర్హతను భారత జాతి నిలబెట్టుకోవాలి. ఆయన విలువల్లో కొన్నయినా పాటించి మన బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలి.

గురువులు, సాధువులు, తారలు, కవులూ గాంధీ బోధించి ఆచరించిన ఈ విలువలను ప్రచారం చేసి ప్రజలను మేల్కొలపాలి.

అధికారాన్ని గ్రామాల వరకూ వికేంద్రీకరించి వ్యక్తి సుఖాన్ని, సమాజహితాన్ని అనుసంధానం చేసి పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ ఆత్మగౌరవం, స్వావలంబన గల జీవితాన్ని అందించాలని లోక్‌సత్తా ఈవేళ

## స్వరాజ్యం తెచ్చారు.. సురాజ్యం తెచ్చేవారి కోసం ఎదురుచూస్తున్నారు

నైతిక రాజకీయ నాయకుడిగా 20వ శతాబ్దపు భారత ఉపఖండ చరిత్రలో శిఖరప్రాయుడు మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ. గుజరాత్‌లోని కథియవాడ్‌లో 1869, అక్టోబర్ 2న జన్మించారాయన. లండన్‌లో బారిస్టర్ చదివి తర్వాత ప్రాక్టీసు కోసం దక్షిణాఫ్రికా వెళ్లారు. అక్కడ ఉండగానే ఆయన తన వ్యక్తిత్వాన్ని, ఆదర్శాలను, పోరాటపంథాను నిర్ణయించుకున్నారు. దక్షిణాఫ్రికాలో స్థిరపడిన భారతీయుల పౌరహక్కుల కోసం అహింసాయుత సహాయనిరాకరణ పద్ధతి ద్వారా గాంధీ పోరాటం గావించారు. అక్కడ విజయం సాధించి 1916లో భారత్‌కు తిరిగొచ్చారు. భారత రాజకీయాల్లో గాంధీ ఒక నూతన సంఘటనగా పరిణమించారు. తన మౌలిక విశ్వాసాలన్నిటినీ ఆయన 1919లో ప్రచురించిన 'హింద్ స్వరాజ్'లో పేర్కొన్నారు. అదే సంవత్సరం బాప్టిస్టు చర్చికి చెందిన రెవరెండ్ జోసఫ్ డోక్ గాంధీ జీవిత చరిత్రను రచించారు. ఒక ఆశ్రమం నెలకొల్పి గాంధీ స్థానిక సమస్యల మీద సత్యాగ్రహ పోరాటాన్ని ప్రారంభించారు. చంపారన్ (బీహార్), ఖైరా (గుజరాత్), అహ్మదాబాద్‌లో రైతులు, మిల్లు కార్మికుల పక్షాన ఈ పోరాటాలు చేశారు. అయితే గాంధీ చేసిన ఈ ప్రయోగాల ప్రభావం అప్పట్లో ఇండియా మీద అంతగా లేదు. భారత్‌కు వచ్చిన నాలుగు సంవత్సరాల తర్వాత కూడా ఆయన రాజకీయాల్లో ప్రాముఖ్యతలోకి రాలేదు. రౌలత్ బిల్లుకు వ్యతిరేకంగా 1919లో దేశవ్యాప్త హర్తాళ్‌కు పిలుపునిచ్చిన తర్వాతే గాంధీ జాతీయనాయకుడిగా పరిణమించారు. ఖిలాఫత్, సహాయ నిరాకరణోద్యమాలతో 1920 చివరినాటికి గాంధీ భారత రాజకీయాల్లో అగ్రస్థాయికి వచ్చి వ్యూహంలో ప్రత్యర్థులను మించిపోయారు. బోల్షివిక్ విప్లవసారథి లెనిన్ సైతం గాంధీని విప్లవాత్మక నాయకుడిగా అంచనా వేశారు. కాంగ్రెస్ బయట, లోపల కూడా గాంధీ విమర్శకులు, వ్యతిరేకులూ ఉన్నారు. ఆయనతో ఏకీభవించలేకపోయినా అవసరం కొద్దీ నాయకత్వాన్ని అంగీకరించినవారూ ఉన్నారు.

1930లో నిత్యావసరమైన ఉప్పు కోసం కొల్లాయిగుడ్డ కట్టి దండి యాత్ర చేసి గాంధీ సామాన్య ప్రజల్లో ఆవేశాన్ని రగిల్చారు. బ్రిటీష్ వాళ్లు రేపిన కులం, మతం చిచ్చులను తనదైన బాణీలో ఆర్పేందుకు ప్రయత్నించారు. వ్యూహాత్మకంగా ముందుకు సాగిన గాంధీ 1942లో 'క్విట్ ఇండియా' పిలుపునిచ్చి తన పోరాటాన్ని ఉధృతం చేశారు. 1945లో రెండో ప్రపంచయుద్ధానంతరం చితికిపోయి వలసల్ని పాలించే శక్తిని కోల్పోయిన బ్రిటీష్ రాజ్యం పేకమేడలా కూలిపోయింది. 1948లో ఒక మతోన్మాది చేతిలో గాంధీ హతమయ్యారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి లండన్ వచ్చిన గాంధీని చూసి బ్రిటన్ ప్రధానమంత్రి విన్‌స్టన్ చర్చిల్ కొల్లాయి కట్టిన బఫూన్‌గా ఎద్దేవా చేశారు. యాభై ఏళ్ల తర్వాత అదే గాంధీ జీవితచరిత్రను బ్రిటీషర్లు సినిమాగా నిర్మించి కోట్ల సొమ్మును, అంతర్జాతీయ పురస్కారాలను పొందారు. తాను తెచ్చిన ఉపరితల స్వరాజ్యాన్ని పునాది స్వరాజ్యంగా సురాజ్యంగా మార్చే మరో గాంధీ కోసం వేల శిథిల విగ్రహాల నుంచి ప్రస్తుతం గాంధీ ఎదురుచూస్తున్నారు.

## 'హింద్ స్వరాజ్'లో మార్పులు చెయ్యవలసిన అవసరం రాలేదు

"మహాత్మాగాంధీ గురువయిన గోపాలకృష్ణ గోఖలే "హింద్ స్వరాజ్" పుస్తకాన్ని చూసినప్పుడు ఇలా అన్నారు "మీకు హిందూ దేశాన్ని గురించి సరైన అవగాహన లేదు. అందుచేత మీరు భారతదేశంలో పర్యటించినప్పుడు మీరు అందులో కొన్ని మార్పులు చెయ్యవలసి వస్తుంది". ఆయన అన్నట్లుగానే బాపూ మూడవ తరగతి రైలు పెట్టెలో ప్రయాణం చేసి హిందుస్తాన్‌లో పర్యటించారు. అయినప్పటికీ తన 'హింద్ స్వరాజ్' పుస్తకంలో మార్పులు చెయ్యవలసిన అవసరం కనిపించలేదు సరికదా ఆయన రాసినదంతా సరైనదేనని ధృవపడింది."


– శివాజీ నరహరిభావే, బ్రహ్మవిద్యామందిర్, పవనారి, వార్ధా (మహారాష్ట్ర)

చేస్తున్న బహుముఖ పోరాటానికి గాంధీజీయే స్ఫూర్తినందించారు.

గాంధీ పాటించిన ఐదు విలువలనూ మన రాజకీయంలో, సమాజంలో భాగం చేసుకోవాలంటే.. అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు, వార్డు స్థాయిలో ప్రజలకు సాధికారత కల్పించటం, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధ పాలన అవసరం. గాంధీ కలలుగన్న రాజకీయం సాకారం చేయగల విధానాలివి. ఈ విధానాలున్న రాజకీయ, సామాజిక వ్యవస్థ కోసం ఓటు హక్కు, భావప్రకటనా స్వేచ్ఛతో పోరాడుతూ గ్రామాలు, పట్టణాలు, నగరాల నుంచి యువ నాయకత్వం ఎదగటమే ఇప్పుడు తెలుగు రాష్ట్రాలు, దేశం ముందున్న మార్గం. ❒

# విశ్వసనీయత ఇలాగే దిగజారుతుంటే..

- శ్రీహరి పాలియత్,
'ఇండియా స్పెండ్'లో విశ్లేషకులు



ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నవారు అవినీతి చర్యలకు పాల్పడటం అనేది ఈమధ్య కాలంలో 95 శాతం పెరిగింది. ఈ మొత్తం సరళిని పరిశీలిస్తే ప్రజల్లో నానాటికీ ప్రభుత్వ పాలనా, ఎన్నికల వ్యవస్థలపై విశ్వాసం తగ్గటం గమనిస్తాం. ఇదింకా రానున్న రోజుల్లో ఇలాగే ఉంటే ప్రభుత్వాల మనుగడ, పాలనావ్యవహారాలపై తీవ్ర ప్రభావం చూపుతుందనటంలో ఎలాంటి సందేహం అవసరం లేదు.

ఈమధ్య అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ (ఏపీయూ), లోక్‌నీతి (సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలప్‌మెంట్ సొసైటీస్) సంస్థలు కలిసి ఉమ్మడిగా దేశంలోని వివిధ వ్యవస్థల పట్ల ప్రజలకున్న విశ్వాసంపై అధ్యయనం చేశాయి. ఈ అధ్యయనంలో పలు ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. 16 రకాల అధికార పాలక సంస్థలు, ఎన్నికల వ్యవస్థలపై ప్రజలకున్న విశ్వసనీయతను అధ్యయనం చేస్తే, వివిధ ప్రాంతాల్లో ఆయా సంస్థలపై విశ్వసనీయత కొంత వేర్వేరుగా ఉండటం కూడా గమనార్హం. ఈ అధ్యయనం దేశంలోని 8 రాష్ట్రాల్లో, 22 అసెంబ్లీ స్థానాల్లో, 16,680 మంది అభిప్రాయాలను తెలుసుకొని క్రోడీకరించారు. ఈ అధ్యయనంలో తేలిందేమంటే.. 77 శాతం మంది భారత మిలిటరీపై అచంచల విశ్వాసం ప్రకటించారు. 54.8 శాతం మంది సుప్రీంకోర్టుపై, 48 శాతం మంది రాష్ట్ర హైకోర్టులపై తమ నమ్మకాన్ని తెలియజేశారు. గమనించాల్సిన విషయమేమంటే ప్రజల విశ్వాసాన్ని చూరగొనటంలో రాజకీయ పార్టీలు అట్టడుగున ఉన్నాయి.

దేశంలో ఎన్నికల వ్యవస్థలు రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు, పార్లమెంట్, అసెంబ్లీలు, పంచాయతీ/మునిసిపల్ కార్పొరేషన్లు 40 శాతం ప్రజల విశ్వాసాన్ని మాత్రమే పొందుతున్నాయి. ఆయా సంస్థలపై వివిధ రాష్ట్రాల్లో వివిధస్థాయిలో నమ్మకాన్ని కలిగి ఉన్నాయి. మహారాష్ట్రలో 60 శాతం మందికి ఎన్నికల వ్యవస్థలైన పార్లమెంట్, అసెంబ్లీ, పంచాయతీ వ్యవస్థలపై విశ్వాసం ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌ను తీసుకుంటే ఈ వ్యవస్థలపై కనిష్ఠ స్థాయిలో నమ్మకం ఉన్నది. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఈ అధ్యయనంలో భాగస్వాములైన సిద్ధార్థ స్వామినాథన్ ప్రకారం.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించటంలో స్థానిక ప్రజాప్రతినిధులు తమ సేవలను విస్తృతంగా అందిస్తున్నారు. ఆయా ప్రజాప్రతినిధులపై ప్రజలకు తగురీతిలో అభిమానం ఉన్నది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే, మహారాష్ట్రలో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు 53 శాతం ఎక్కువ మార్కులు వచ్చాయి. ఈ క్రమంలోనే చూస్తే, జార్ఖండ్‌లో 52.5 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 49.5 శాతం విశ్వసనీయత ఉన్నది.

రాజకీయపార్టీల పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసం అతి కనిష్ఠ స్థాయిలో ఉన్నది. రాజకీయ పార్టీలకు స్థూలంగా చూస్తే 1.75 శాతమే ప్రజల్లో విశ్వసనీయత ఉన్నది. మహారాష్ట్రలో మాత్రం ఇది 31 శాతంగా ఉన్నది. మిగతా ఏడు రాష్ట్రాల్లో ప్రజల నమ్మకాన్ని చూరగొనటంలో సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. రాజకీయ పార్టీలు మొత్తంగా విశ్వసనీయ స్థాయిలో చూస్తే 16వ స్థానంలో నిలిచాయి.

73 శాతం మందికి భారత ప్రభుత్వంపై సడలని నమ్మకం వ్యక్తం చేశారు. అదే అమెరికన్ ప్రభుత్వంపై అక్కడి ప్రజల్లో 30 శాతం మందికి మాత్రమే విశ్వాసం ఉన్నది. గవర్నమెంట్ ఎట్ ఏ గ్లాన్స్- 2017 రిపోర్ట్ ప్రకారం ఇది వెలుగులోకి వచ్చింది. ఇదే 2007లో చూస్తే ప్రభుత్వంపై 82

శాతం విశ్వసనీయత ఉండేది. అదిప్పుడు 73 శాతానికి పడిపోయింది.

పార్లమెంట్ ప్రభావశీల విశ్వసనీయతపై 8 రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తే 36 శాతం మంది మాత్రమే సానుకూలంగా స్పందించారు. ఈ విధమైన అధ్యయనమే 2013లో సీఎస్‌డీఎస్ చేస్తే 56 శాతం మంది సానుకూలంగా స్పందించారు. ఇది 2005లో 43 శాతం మాత్రమే ఉండేది. ఇదేక్రమంలో కోర్టుల విషయాన్ని కూడా చూస్తే.. న్యాయవ్యవస్థపై ప్రజలు మెరుగైన విశ్వాసాన్ని కనబరిచారు. న్యాయవ్యవస్థలో పైనుంచి కింది దాకా చూస్తే అత్యున్నత న్యాయస్థానంపైనే అతి ఎక్కువ విశ్వాసం ఉన్నది. ఆ తర్వాత రాష్ట్ర హైకోర్టులు, జిల్లా కోర్టులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం జిల్లా కోర్టులపై 28 శాతం మందికి మాత్రమే విశ్వాసం ఉన్నది. సుప్రీంకోర్టుపై 21 శాతం, హైకోర్టుపై 20 శాతం మాత్రమే విశ్వాసం ఉండటం గమనార్హం. మిగతా ఏడు రాష్ట్రాల్లో చూస్తే సుప్రీంకోర్టుపై 60 శాతం, హైకోర్టులపై 52 శాతం విశ్వాసం ఉన్నది. ముఖ్య పాలనా వ్యవస్థలు ఐదింటిలో కోర్టులే అత్యధిక శాతం ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నాయి. మిగతా వ్యవస్థలన్నీ కోర్టుల తర్వాత స్థానాల్లోనే నిలిచాయి.

ప్రజలకు వివిధ వ్యవస్థలపై ఉండే విశ్వాసం వాటితో ఉండే సంబంధాలు, నిత్యజీవిత అనుభవంపై ఆధారపడి ఉంటాయని స్వామినాథన్ తెలిపారు. జిల్లా కోర్టులు, పోలీసులతో ప్రజలకు రోజువారీ సంబంధాలు ఉంటాయి. వాటి ఆధారంగానే ఆ వ్యవస్థలపై విశ్వసనీయత ఏర్పడుతుంది. మరి కొంతమంది, కొన్నిరకాల వ్యవస్థలపై ప్రత్యేక అభిప్రాయాన్ని, మరికొన్నింటిపై వ్యతిరేక అభిప్రాయాన్ని కలిగి ఉంటారు. ఇలాంటి వర్గాలు నిర్దిష్టమైన వ్యవస్థలపై ప్రత్యేకమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చుతారు. రోజువారీ సమస్యలతో ప్రజలతో నిత్యం సంబంధాల్లో ఉండే జిల్లా కలెక్టర్‌పై ప్రజల్లో 47 శాతం మాత్రమే విశ్వాసం ఉన్నది. అదే హైకోర్టులపై మెరుగైన అభిప్రాయం ఉన్నది. మహారాష్ట్రలో జిల్లా కలెక్టర్లపై 69 శాతం నమ్మకం ఉంటే, ఏపీలో 45 శాతం మాత్రమే ఉన్నది.

ఇక ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసుల విషయానికొస్తే, వారు రాజకీయ పార్టీలకన్నా ఎగువన మెరుగైన విశ్వసనీయతలో ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగంలోని తహసీల్దార్‌కు ప్రజల్లో 4.8 శాతం విశ్వాసం ఉండగా, పోలీసులకు 0.9 శాతం మాత్రమే విశ్వాసం ఉన్నది. ఇదేతీరు రాజకీయ నేతల విషయంలోనూ ఉన్నది. వారిలో పారదర్శకత లేకపోవటం, ప్రజావసరాలను తీర్చకపోవటం, అవినీతి తదితర అంశాలలో క్రమంగా ప్రజల్లో విశ్వాసానికి దూరమవుతున్న స్థితి కనిపిస్తున్నది. ఇది గత కొన్ని దశాబ్దాలుగా చూస్తే ఏటా విశ్వసనీయత సన్నగిల్లుతూనే ఉన్నది. అవినీతి విషయాన్ని చూస్తే, ప్రతిరోజూ 11 అవినీతి కేసులు నమోదవుతున్నాయి. 176 దేశాల్లో మన దేశం 79వ స్థానంలో నిలిచింది.

ఈ క్రమంలో చూస్తే.. మీడియా కూడా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయటంలో ప్రధానపాత్ర వహిస్తోంది. ఒడిదుడుకులున్నా ఎన్నికల కమిషన్ కూడా ప్రజల విశ్వాసాన్ని చూరగొనటంలో ముందుంటోంది. ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నవారు అవినీతి చర్యలకు పాల్పడటం అనేది ఈమధ్య కాలంలో 95 శాతం పెరిగింది. ఈ మొత్తం సరళిని పరిశీలిస్తే ప్రజల్లో నానాటికీ ప్రభుత్వ పాలనా, ఎన్నికల వ్యవస్థలపై విశ్వాసం తగ్గటం గమనిస్తాం. ఇదింకా రానున్న రోజుల్లో ఇలాగే ఉంటే ప్రభుత్వాల మనుగడ, పాలనావ్యవహారాలపై తీవ్ర ప్రభావం చూపుతుందనటంలో ఎలాంటి సందేహం అవసరం లేదు.


(నమస్తే తెలంగాణ సౌజన్యంతో) ❒

# పోలింగ్ కేంద్రాలను అందుబాటులో ఏర్పాటు చేయాలి



త్వరలో జరగనున్న ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడు సీహెచ్ వంశీప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి సర్కిల్ డీసీ దశరథ్‌తో ఆయన సమావేశమయ్యారు. బస్తీలో స్థానికులు సౌకర్యవంతంగా ఓటు వేసే విధంగా పోలింగ్ స్టేషన్లను సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

# మన ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యమెంత?



- బండారు రామ్మోహనరావు

ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాణం – కానీ ఎన్నికలే ప్రజాస్వామ్యం కాదు. మన ప్రజాస్వామ్య భారతానికి డెబ్భై ఒక్క సంవత్సరాలు. మనదేశంలో గత ఏడు దశాబ్దాలుగా ఇతర దేశాల కంటే బాగా మూడు వ్యవస్థలు పనిచేస్తున్నాయి. ఐదేళ్లకోసారి చట్టసభలకు ఎన్నికలు, పదేళ్లకోసారి జనాభా లెక్కలు తీయడం, వ్యాధి నివారణ కోసం టీకాలిచ్చే కార్యక్రమం 'ఇమ్యునైజేషన్'. ప్రపంచ పటంలోని రెండు వందల దేశాలలోకెల్లా మన ప్రజాస్వామ్యం విశిష్టమైనది. మన బలం అదే. కానీ నిర్మాణలోపాల వల్ల అదే మన బలహీనతగా కూడా మారుతోంది. దేశంలో ఇప్పటివరకు పదహారుసార్లు పార్లమెంటుకు ఎన్నికలు జరిగాయి. ప్రతిసారి ఏదో ఒక పార్టీని దేశ పాలనావ్యవస్థకు సారథిగా ఎన్నుకుంటున్నాము. ఈ అధికార మార్పిడి రక్తపాతంలేకుండా శాంతియుతంగా జరుగుతూనే ఉంది. అలాగే దేశంలో రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాలలో కూడా ఎన్నికల ద్వారా అధికార మార్పిడి జరుగుతూనే ఉంది.

ఎన్నికలంటే 'వన్‌డే క్రికెట్ మ్యాచ్ కాదు'. ఎన్నికల రోజు ఓటు వేయడం, ఆ తర్వాత ఐదు సంవత్సరాలు మనల్ని మనం తిట్టుకుంటూ, అధికారంలో ఉన్నవారిని తిట్టిపోస్తూ శాపనార్థాలు పెడుతూ ఉండడం కాదు. ఎన్నికకూ – ఎన్నికకూ మధ్య ఏమి జరగాలో నిర్ణయించటంలో ప్రజాస్వామ్య పౌరసమాజ వ్యవస్థలో ప్రజల పాత్ర ఎక్కడికక్కడ గరిష్ఠ స్థాయిలో ఉండాలి. దురదృష్టవశాత్తూ అది జరగడం లేదు. అధికారంలోకి వచ్చిననాటి నుండి అధికార పార్టీలు విర్రవీగుతూ ఆత్మస్తుతి, పరనిందలతో కాలం గడుపుతుంటే, అధికార పార్టీని, అధికారంలోకి వచ్చిన తెల్లవారే దిగిపొమ్మనే ప్రతిపక్ష పార్టీలు తయారైనాయి. ప్రజలు అధికార పార్టీకి అనుకూలంగా తీర్పునిస్తే.., ఆ పార్టీ ప్రభుత్వం ఏమి చేస్తోందో, ఎటువైపు పోతోందో చూసే ఓపిక లేని ప్రతిపక్ష పార్టీలు తయారైనాయి. అదేవిధంగా అధికార పార్టీలు కూడా ప్రజలు, పార్టీల విమర్శలను సకారాత్మకంగా తీసుకుని లోపాలుంటే దిద్దుకునే బదులు ప్రజలు, ప్రతిపక్షాలపై ఎదురుదాడికి దిగుతున్నాయి. ఒక్కోసారి భావజాలాన్ని వ్యతిరేకించే క్రమంలో భౌతికదాడులకు కూడా దిగుతున్నాయి. పాలక పక్షాల అసహనానికి ఇది పరాకాష్ఠ.

ప్రజాస్వామ్యంలో పాలకపక్షానికి ఎంత బాధ్యత ఉందో, ప్రతిపక్షానికీ అంతే బాధ్యత ఉంది. ప్రజల పట్ల ఆ బాధ్యతను నెరవేర్చడంలో దేశంలో పార్టీలు విఫలమవుతున్నాయి. ప్రజాస్వామ్యం అంటే ఒక్క ఓటు మెజారిటీ, నెంబర్‌గేమ్ కాకూడదు. అలాఅవుతే ప్రజాస్వామ్యం 'మందస్వామ్యం'గా మారుతుంది. మందస్వామ్యంలో 'గొర్రెలు', గొర్రెల కాపరి మాత్రమే ఉంటారు. బృంద నాయకత్వం, కలిసి ఆలోచనలు పంచుకోవడం, కలిసి పని విభజన చేసుకోవడం, కార్యాచరణకు పూనుకోవడం ఉండదు. మందస్వామ్యంలో అందరూ అనుచరులే. గొర్రెల కాపరి ఒక్కరే గొర్రెల్ని మళ్లిస్తుంటారు. లక్ష్యం సరైనదైతే మంచికి, లక్ష్యనిర్దేశం సరిగా లేకపోతే అధ:పాతాళానికే పయనం.

మన ప్రజాస్వామ్య వ్యవస్థలో కొన్ని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక ఓటు మెజారిటీతో నెంబర్‌గేమ్ కొనసాగడం వల్ల ప్రజల ఓట్ల శాతానికీ, ఎన్నికలలో తుది ఫలితానికీ పొంతన ఉండడం లేదు. ఎన్నికలకూ, ఎన్నికలకూ మధ్య పాలనలో ఏమి జరగాలో నిర్ణయించే ప్రజల భాగస్వామ్యం కొరవడడం, ఎన్నికలు మన కోసం కాదులే అది పార్టీల కార్యకర్తల వ్యవహారం అని కొద్దిమందే కాదు చాలామంది చదువుకున్నవారు, విజ్ఞులు భావిస్తుండడం – ప్రజల నిర్లిప్తత, నిరాసక్తత పార్టీల స్వార్థరాజకీయాలకు వరంగా మారుతోంది. ఎన్నికలు పార్టీల కోసం కాదు, ప్రజల కోసం అనే నినాదంతో పౌరసమాజం చైతన్యవంతం కావాలి. ఎన్నికలు పార్టీల సొంత వ్యవహారం కాదనే స్పృహ పెరగాలి.

స్వాతంత్ర్యం వచ్చెననీ – సభలే చేసి సంబరపడగానే సరిపోదోయి,

సాధించినదానికి సంతృప్తిని పొంది – అదే విజయమనుకుంటే పొరబాటోయి

అన్న శ్రీశ్రీ మాటలు అక్షరసత్యాలు.

'అందరి కోసం ఒక్కరు నిలిచి, ఒక్కని కోసం అందరు కలిసి' పనిచేయాలన్న ఆలోచన ప్రజాస్వామికంగా రావాలి.

పాడవోయి భారతీయుడా – సాగవోయి ప్రగతిదారులా అనే ప్రజాస్వామ్య స్ఫూర్తిని వెలిగించాలంటే – చీకటిని తిడుతూ కూర్చోవద్దు, చిరుదీపాన్ని వెలిగించే ప్రయత్నం చేయాలి. తిమిరంతో సమరం చేయాలి.

అసతోమా సద్గమయ – అసత్యం నుండి సత్యానికి

తమసోమా జ్యోతిర్గమయ – చీకటి నుండి వెలుగుకి

మృత్యోర్మా అమృతంగమయ – మృత్యువు నుండి శాశ్వతత్వం వైపునకు సాగాలనే వేదవాక్కు మనల్ని ప్రభావితం చేయాలి. ❐

## అక్రమాలపై పంచాయతీని చైతన్యపరిచిన లోక్‌సత్తా నేత.. గ్రామదర్శినిలో అధికారులను నిలదీసిన ప్రజానీకం




గోదావరి జిల్లా ఐ.పోలవరం మండలం ఎదుర్లంక పంచాయతీకి ఆయిల్ ఇండియా కంపెనీ ఇచ్చే రూ.50లక్షల సీఎస్ఆర్ నిధులను గ్రామస్తులకు తెలియకుండా కొంతమంది అధికారపక్ష నాయకులు బడా భూస్వాముల రొయ్యల చెరువులకు రోడ్లు వేసేందుకు మళ్లించటాన్ని బైటపెట్టిన గ్రామ ఎంపీటీసీ (లోక్‌సత్తా) ముదునూరి రాజశేఖరవర్మ.. ఆ అక్రమాలపై ప్రజలను చైతన్యపరచటంతో 'గ్రామదర్శిని' కార్యక్రమంలో ప్రజలు అధికారులను నిలదీశారు. రామాలయంపేటలో రూ.43 లక్షల వ్యయంతో మంచినీటి సంపు కోసం శంకుస్థాపన చేసి రెండేళ్లయినా కనీసం రెండు చుక్కల నీరు రాలేదని ప్రశ్నించారు. ఆగస్టులో పంచాయతీలు రద్దయ్యే ఐదు నెలల ముందు నుంచి ఒక్కసారి కూడా సర్వసభ్య సమావేశం ఎందుకు జరగలేదని అడిగారు. ఈ ప్రశ్నలన్నిటికీ అధికారులు మౌనం వహించటం విశేషం. సరైన సమాధానాలు రాకుంటే వీటిపై జిల్లా స్థాయిలో ఫిర్యాదులు చేస్తామని రాజ్ వర్మ, గ్రామస్తులు తెలిపారు.

## ఎన్నికల సంస్కరణలు జరగాలి



ఎన్నికల వ్యవస్థ ఈవేళ వ్యాపార రంగంగా మారి రాజకీయ వ్యవస్థ భ్రష్టుపట్టిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.వెంకటరమణబాబు అన్నారు. గుంతకల్లు నియోజకవర్గ లోక్‌సత్తా అధ్యక్షుడు సన్నపాడమల రామ్మోహన్ అధ్యక్షతన పార్టీ స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సురాజ్య సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యువత, మధ్యతరగతి రాజకీయాలను పట్టించుకోవాలని, ఓటును సద్వినియోగం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో నల్లడబ్బు పాత్ర లేకుండా చేసి రాజకీయ అవినీతిని అరికట్టటంలో యువత చురుకైన పాత్ర పోషించాలన్నారు. రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల విధానం ద్వారా సామాన్యులు కూడా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలను సరైన హామీలను అడగాలన్నారు. తాయిలాల స్థానంలో.. ప్రజలు తమకు వాస్తవంగా ఎంతో ఉపయోగపడే నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, లంచాల్లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు, లాభసాటి వ్యవసాయం, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాల కోసం డిమాండ్లు చేయాలన్నారు. వీటి కోసమే లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ సురాజ్య యాత్ర నిర్వహించారన్నారు. ఆ యాత్రకు కొనసాగింపుగా సురాజ్య సదస్సుల్ని జిల్లాలవారీగా చేపట్టామన్నారు. సురాజ్య ఎజెండాను ఇంటింటికీ తీసుకెళ్లాలని, ఈ ఎజెండా ప్రజల డిమాండ్‌గా మారితే ఎన్నికల్లో రాజకీయ పార్టీల తీరే మారిపోతుందన్నారు. సదస్సులో లోక్‌సత్తా పార్టీ గుంతకల్లు పట్టణ అధ్యక్షుడు కుందా నాగార్జున, కోశాధికారి ఖలీల్, నాయకులు మధు, గోపాల్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# యాజలి గ్రామ "లక్ష్మీ"




- అఖిల్ చిర్రావూరి

స్వాతంత్ర్యం రాకముందు నుంచి మన జాతిపిత మహాత్మాగాంధీ అనేక సందర్భాలలో గ్రామ స్వరాజ్యం గురించి, గ్రామ స్వయంపాలన గురించి, దేశ ప్రగతి, అభివృద్ధిలో గ్రామాల విశిష్ట పాత్ర గురించి వివరించారు. పూర్ణ స్వరాజ్యం అనేది గ్రామాలతోనే మొదలవుతుందని, గ్రామాలు బాగుపడితే ప్రజలు-దేశం బాగుపడతాయని నమ్మిన ఎంతోమంది మేధావులలో బాపూజీ ఒకరు. అయితే స్వాతంత్ర్యం వచ్చిన 71 సంవత్సరాల తరువాత కూడా ఆ గ్రామాల్లో పరిస్థితులు మెరుగుపడకపోవడం, జీవన విధానాల్లో గ్రామీణ ప్రజలు ఎంతో వెనుకబడి ఉండడం, చివరికి బతుకుతెరువు కోసం గ్రామాలను విడిచి వలస వెళ్లిపోవడం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం.

ఎన్నో ప్రభుత్వాలు, ఎన్నో పాలనా విధానాలు, ఎన్నో చట్టాలు, మరెన్నో ఆలోచనలు ఆపై ఇంకెన్నో పథకాలు - ఇన్ని చూసిన గ్రామాలు ఇంకా ప్రగతిని, అభివృద్ధిని, వ్యక్తిత్వ వికాసాన్ని మాత్రం చూడలేదు సరిగదా, 'అసలు ఎప్పుడు చూడగలవు?' అనే ప్రశ్నకు సమాధానం కూడా అగమ్యగోచరమనే చెప్పాలి.

ఈ గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించాలనే ఒక బృహత్ సంకల్పంతో ఎందరో వ్యక్తులు, ఎన్నో ఎన్‌జీవోలు, ఎన్నో ప్రైవేటు కంపెనీలు వివిధ పద్ధతులలో ఒక కార్యాచరణ రూపొందించుకొని వాటి అనుసారంగా అనేక మార్పులకు శ్రీకారం చుట్టాయి. అలాంటి ఓ యువ గ్రామసంస్కర్త శ్రీ ఇక్కుర్తి లక్ష్మీనరసింహ.

ఇక్కుర్తి లక్ష్మీనరసింహ గుంటూరు జిల్లా కర్లపాలెం మండలంలో బాపట్లకు సమీపంలో ఉండే యాజలి గ్రామానికి చెందినవారు. ఆయనకు బాల్యం నుండి వ్యవసాయం పట్ల ఆసక్తి ఉండటంతో.. హైదరాబాద్‌లో వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నప్పటికీ గ్రామాభివృద్ధి పట్ల, వ్యవసాయంలోని నూతన విధానాల పట్ల ఉత్సుకత చూపిస్తూ, తన గ్రామం యాజలి ప్రగతి కోసం పాటుపడుతున్నారు.



## వ్యవసాయం ఎందుకు జీవనాధారం అవదు?

గ్రామ స్వపరిపాలన, గ్రామ స్వరాజ్యం తప్ప దేశాభివృద్ధికి మరో మార్గం లేదని బలంగా నమ్మే వ్యక్తి నరసింహ. ఈ నేపథ్యంలో భాగంగా ఆయన స్వగ్రామం యాజలిలో విస్తృతంగా పర్యటించి ఆ గ్రామ ప్రజలు.. రైతులు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, నిమ్మవర్గాలకు చెందినవారు పడుతున్న కష్టాల గురించి తెలుసుకోవడం మొదలుపెట్టారు. ఈ డిజిటల్ యుగంలో కూడా ప్రాచీన వ్యవసాయ విధానాలు అనుసరించి రైతులు చాలా నష్టపోతున్నారన్న విషయాన్ని గ్రహించారు. దీంతో, తన తోటివారితో, స్నేహితులతో, సహాయకులతో కలిసి యాజలి గ్రామంలో అవగాహన సదస్సులు, చైతన్య సమితులు నిర్వహించి గ్రామ ప్రజలలో.. ముఖ్యంగా రైతులలో నూతన వ్యవసాయ పద్ధతుల పట్ల, సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహనను పెంపొందించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంలో రైతులకు తాము వెల్లడిస్తున్న అంశాలు, సూచనలు, మెళకువలు అవగతమవడంలేదని గ్రహించిన నరసింహ.. వేరే విధంగా ఊరిని మార్చాలని అనుకున్నారు. ఈ ప్రక్రియలో రైతు ఎదుర్కొంటున్న సమస్యలను వ్యక్తిగత స్థాయిలో, సామూహిక స్థాయిలో పరిష్కరించు కుంటూ వచ్చేవారు.

యాజలిలో వ్యవసాయ రంగంలో తన అనుభవాలను, విశేషాలను ఇటీవల ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ఇంటెర్న్‌లతో నరసింహ పంచుకుంటూ.. గ్రామ ప్రజలకు ఆర్థిక అవగాహన లోపించడం, డబ్బును సక్రమంగా వినియోగించడంలో చిత్తశుద్ధి లేకపోవడం, శాశ్వత ప్రయోజనాలను పక్కనబెట్టి తాత్కాలిక ప్రయోజనాలకు పెద్దపీట వేయడం వంటి అంశాలు రైతులను అనేక విధాలుగా నష్టపరుస్తున్నాయని తెలిపారు. తన బృందంతో పాటు నరసింహ ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ నిపుణులను, పరిశోధనా విభాగ సభ్యులను సంప్రదించి యాజలి రైతుల/వ్యవసాయ అభివృద్ధి కోసం ఒక ఎం.ఓ.యూని ఒప్పందపరచుకున్నారు.

అందులో భాగంగా వారాంతంలో విశ్వ విద్యాలయం తరపున పరిశోధనా నిపుణులు, ప్రొఫెసర్లు యాజలి గ్రామానికి వచ్చి వ్యవసాయంలోని నూతన పద్ధతులు, విధానాలు, మెళకువలను గ్రామ రైతులకు అర్థమయ్యేలా శిక్షణా శిబిరాలలో చెప్పేవారు. అయితే చాలా తక్కువ మంది రైతులు ఇందులో భాగస్వాములవడం తనకు ఆశ్చర్యాన్ని, బాధని కలిగించినట్టు నరసింహ వివరించారు. దీనికి కారణ మేంటి అని అన్వేషించగా.. రైతులకు వ్యవసాయం పట్లగానీ, నూతన వ్యవ సాయ విధానాలు తెలుసుకుని వాటిని అమలు పరచడం పట్లగానీ ఎలాంటి ఆసక్తి లేదని అవగతమైంది. గత్యంతరం లేక, మరొక పని చేతగాక, చేయడం తెలియక రైతులింకా వ్యవసాయంలో కొనసాగుతున్నారని అర్థమైంది.

ఇవన్నీ గమనించిన నరసింహలో 'అసలు వ్యవసాయం జీవనాధారం ఎందుకు అవదు?' అనే ప్రశ్న మొదలైంది. ఈ ప్రశ్నకు సమాధానం వెదుకుతూ దక్షిణభారతంలోని పలు రాష్ట్రాలలో పర్యటించి అనేక మంది రైతులను కలిసి వారి ద్వారా వ్యవసాయానికి, పంటకి సంబంధించిన ఒక విశేషమైన జ్ఞానసంపదని సంపాదించుకున్నారు. ఈ అన్వేషణ ఆధారంగా ఆయన తెలుసుకున్న ప్రధాన అంశాలు రెండు. 1) రైతు కనిష్ఠ మద్దతు ధర పంటను ఎప్పుడైతే విడిచిపెట్టి ఇతర లాభతరమైన పంటల వైపు మొగ్గు చూపుతాడో అప్పుడే లాభాలు సాధించి వాళ్ల జీవితాలను వాళ్లు రైతులు బాగు చేసుకోగలరు. కాకపోతే రైతులను ఒక్కసారిగా కనిష్ట మద్దతు ధర పంటల నుండి లాభతరమైన పంటల వైపు ఎలా మళ్లించాలి? ఒకవేళ మళ్లించినా, అనుకున్నరీతిలో ఫలితాలు సాధించ లేకపోతే ఎవరు బాధ్యులు అనే ప్రశ్న ఒక





పెనుసవాలుగా మారింది. ఈ విషయంలో తనకు దిశానిర్దేశం చేయగలిగే సమర్థులు ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అని నమ్మి ఆయనను కలిసి విషయమంతా పూసగుచ్చినట్టు వివరించి ఆయన సలహాలు, సూచనలు తీసుకొని రైతు పంట పండించే విధానంలోనే తాను మార్పును తీసుకురావడం మేలని అర్థం చేసుకున్నారు. 2) వ్యవసాయం జీవనాధారం, లాభదాయకం కావాలంటే ముందుగా వ్యవసాయం ద్వారా ఒక రైతుకి తన నెలసరి ఖర్చుకు తగ్గ ఆదాయం వస్తుందా లేదా అనే ప్రశ్నకు సమాధానం అన్వేషించాలి. ఈ నేపథ్యంలో ఒక రైతుకి ప్రతి నెలా తన కుటుంబానికి సంబంధించి రూ. 20,000 ఖర్చు పడుతుందని (అంటే సంవత్సరానికి రూ. 2,40,000), ఈ మొత్తాన్ని వ్యవసాయం ద్వారానే సంపాదించాలి అని గుర్తించిన నరసింహ.. యాజలి గ్రామంలోని వ్యవసాయ రంగంలోకి అడుగుపెట్టి కొత్త పుంతలు తొక్కించే విధంగా పనిచేయడం ప్రారంభించారు.

ప్రాకృతిక వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, రసాయన వ్యవసాయంలో ఏదో ఒకటి మేలైనదని, మరొకటి హేయమైనదని అంటూ ఏమీ లేదని ఆయన దృఢవిశ్వాసం. కాకపోతే రసాయన వ్యవసాయ పద్ధతులలో రైతులు అధిక దిగుబడి సాధించే దృష్ట్యా అధిక మోతాదులో రసాయనాలను వినియోగించడం శోచనీయమని, ఈ దిశగా నియంత్రణా చర్యలు ప్రభుత్వం చేపట్టాలని అన్నారు. అదే సమయంలో ప్రాకృతిక, సేంద్రియ వ్యవసాయానికి సంబంధించి చట్టాలు, ప్రజా-రైతు ప్రయోజన విధానాలు, వీటికి సంబంధించి వ్యవస్థలు, యంత్రాంగం లేకపోవడంతో ఎంత నష్టం జరుగుతుందో వివరించారు. దీనికి సంబంధించి దిద్దుబాటు చర్యలను ప్రభుత్వాలు చేపట్టాలని స్పష్టం చేశారు.

వ్యవసాయం గురించి సీబీఐ మాజీ జేడీ వి.వి లక్ష్మీనారాయణతో జరిపిన సంభాషణను గుర్తుచేసుకుంటూ.. చైనా మన దేశం కంటే వరి పండించడంలో ఎంతో ముందుందని, వరి నుండి ఇతర పంటల పైనా మన దేశం దృష్టి పెట్టాలని నరసింహ అన్నారు. చైనా ఎకరానికి - 120 బస్తాల వరి ధాన్యం పండిస్తుంటే, మన దేశం కేవలం 40-65 బస్తాల ధాన్యం పండిస్తోందని వెల్లడించారు.

కనిష్ఠ మద్దతు ధరేతర పంటలు పండించడం, రైతుకు ఆర్థిక పెట్టుబడి తగ్గేలా వివిధ విధానాల రూపకల్పన చేయడం, వ్యవసాయానికి కావాల్సిన యంత్రాలను ఔట్‌సోర్స్ చేయడం, సామూహిక వ్యవసాయ మార్కెటింగ్ వంటి మార్గాలను అనుసరించి సాగును లాభదాయకం చేసుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. దళారీల అవసరం లేకుండా రైతే స్వయంగా తన పంటను అమ్ముకునేలా ఒక వినూత్న వ్యాపార




సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారి తన సొంత వూరు యాజలిలో రైతుల సాధికారత, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల కోసం కార్యక్రమాలను చేపట్టిన లక్ష్మీనరసింహ ఇక్కుర్తితో ఫౌండేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ ఇంటెర్న్‌ల ముఖాముఖి! తన గ్రామ పరివర్తన కోసం వ్యవసాయంలో వేస్తున్న నూతన అడుగులను, మానవాభివృద్ధి రంగాల్లో, మహిళా సాధికారత వంటి సామాజిక అంశాల్లో అమలు చేస్తున్న ప్రణాళికల్ని, ప్రాతిపదికల్ని ఆయన ఎఫ్‌డీఆర్ బృందంతో పంచుకున్నారు.

వేదికను సిద్ధం చేనస్తూ, వాటిని బ్యాంకులతో అనుసంధానం చేస్తూ, వివిధ ఎఫ్.పి.ఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)ల ద్వారా రైతుకు నేరుగా లాభాలు సమకూరతాయని వెల్లడించారు.

### పాడి - పశుసంపద రంగం

వ్యవసాయ అనుబంధ విభాగాల్లో విధానాల గురించి మాట్లాడుతూ, పశు సంపద, పాల వ్యాపారంలోని లోటు పాట్లు, పశువులను పాలించి, పోషించే విధానాలలోని కష్టాలు, పరిష్కార మార్గాలను గురించి వివరించారు.

డెయిరీ హాస్టల్స్ అనే ప్రతిపాదనను గురించి చెబుతూ, అతి తక్కువ మానవ వనరులతో అత్యంత మెరుగైన దిగుబడిని సాధించే ప్రక్రియగా దీన్ని అభివర్ణించారు.

### మరి రైతు కూలీల సంగతేంటి...?

ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు రైతుకి ఎంత మేలు చేస్తున్నాయో చెప్పడం కష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు ఏర్పాటు చేసే స్కీంలు రైతులకి వర్తిస్తాయి తప్ప రైతు కూలీలకు వర్తించవని గుర్తుచేశారు. ఈ దిశగా పెనుమార్పులు రావాలంటే ప్రభుత్వాలతో పాటు యువత కూడా కొంత అవగాహన తో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

### విద్యకు సంబంధించి

గ్రామాల్లో వ్యవసాయం తరువాత వచ్చే అతి ముఖ్యమైన సమస్య విద్యారంగానికి సంబంధించింది. సరైన విద్యాప్రమాణాలు లేక ఎంతోమంది నిరక్షరాస్యులుగానే మిగిలిపోతున్నారని నరసింహ ఆవేదన వ్యక్తం చేశారు. యాజలి గ్రామంలోని విద్యాప్రమాణాలు ఆ చుట్టుపక్కల ఊళ్లకు ఆదర్శప్రాయం కావాలని, ఇతర గ్రామాల్లో నివసించే పిల్లలు సైతం యాజలి గ్రామ పాఠశాలలో అత్యంత ఉన్నత విద్యను అభ్యసించాలని ఆయన ఆకాంక్షించారు. ఇందులో భాగంగా తన మిత్రుల ఆర్థిక సహకారం, సహాయంతో ఒక అద్భుతమైన పాఠశాలను నిర్మాణం చేసినట్టు చెప్పారు. అన్ని వసతులతో కూడుకున్న ఈ పాఠశాలలో పాఠ్యాంశాల విద్యతో పాటు శారీరక ఉల్లాసం, మానసిక ఉత్తేజం వంటి కీలక అంశాలపై శ్రద్ధ చూపుతున్నట్టు వివరించారు.

గ్రామాల్లో నివసించే పిల్లలకు శారీరక పటుత్వం ఎక్కువగా ఉంటుందని గుర్తు చేనస్తూ, ఈ సామర్థ్యాన్ని పూర్తిగా అందిపుచ్చుకోవాలనే ఒక సదుద్దేశంతో ఒక ఫిజికల్ ట్రైనర్ (పీటీ)ని నియమించి పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తిని పెంచు తున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ జట్టులో ప్రతి సంవత్సరం యాజలి గ్రామం నుంచి ఇద్దరు క్రీడాకారులు తప్పకుండా ఉంటారని సగర్వంగా చెప్పుకున్నారు. ఈ స్ఫూర్తితోనే జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో కూడా రాణించాలని సంకల్పంతో కృషి చేస్తున్నామని వెల్లడించారు.

### ఇతర సమస్యలు, వాటి అనుభవాలు...

మిగతా సమస్యల గురించి మాట్లాడుతూ, మద్యం–సారా వ్యాపారాలు గ్రామాలను, గ్రామీణ ప్రజల జీవితాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని, చిన్న పిల్లలు, స్త్రీలు ముఖ్యంగా నష్టపోతున్నారని నరసింహ తెలిపారు. తమ గ్రామంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం బారిన పడి చనిపోయిన వ్యక్తుల గురించి విని కలత చెంది ఏ విధంగా గ్రామ స్త్రీలను వెంటపెట్టుకుని వెళ్లి మద్యం దుకాణాన్ని ధ్వంసం చేశారో, ఆ తర్వాత చట్టపరంగా ఉన్న అవకాశాలను ఉపయోగించుకుని గ్రామంలోకి మళ్లీ ఇంకో మద్యం దుకాణం రాకుండా నియంత్రించ గలిగారో వివరించారు. ❒




# ప్రవాసులకు నజరానా

- నీరజ్ కుమార్

విదేశాల్లో 1.6 కోట్ల మంది భారతీయులు నివసిస్తున్నారు. వారిలో అత్యధికులకు ఓటుహక్కు లేదు. మెక్సికో, రష్యాల తరవాత భారతదేశ పౌరులే ఎక్కువగా విదేశాల్లో ఉంటున్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా ఓటుహక్కు వినియోగించుకోవాలంటే వారు వ్యక్తిగతంగా సొంత నియోజక వర్గాలకు రావలసి వస్తోంది. అది ప్రవాస భారతీయులకు ఆర్థికంగానూ, ఇతర త్రాను కష్టసాధ్యంగా మారుతోంది. దాంతో వారు తమ ఓటుహక్కు వినియోగించుకోలేక పోతున్నారు. పరిస్థితి ఇప్పుడు మారనున్నది. ఎన్ఆర్ఐలు, తాము నివసిస్తున్న దేశాల నుంచే పోస్టల్ లేదా ఇ-బ్యాలెట్ పద్ధతిలో ఓటు వేసేందుకు వీలుగా లోక్‌సభ బిల్లును ఆమోదించింది.

## సుదీర్ఘ నిరీక్షణ

విద్య లేదా ఉపాధి అవకాశాలు వెతుక్కొంటూ విదేశాలకు వెళ్లి, అక్కడి పౌరసత్వం తీసుకోకుండా నివసిస్తున్న భారతదేశ పౌరులను ప్రవాస భారతీయులు అని అంటారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం (1950)లోని సెక్షన్ 20 'ఎ' లోని నిబంధనల ప్రకారం వారు భారతదేశంలో ఎన్నికల జాబితాలో పేరు నమోదు చేసుకోవచ్చు. ఎన్నికలు జరిగినప్పుడు ఇక్కడికి వచ్చి ఓటు వేయవచ్చు. ప్రస్తుతం ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళుతున్నవారి సంఖ్య బాగా పెరుగుతోంది. విదేశాలకు వెళ్లి చదువు కొంటున్న భారతీయుల సంఖ్య 2006లో 1.23 లక్షలు. వారిలో 76,500మంది అమెరికాలో చదువుకొంటున్నారు. తరవాతి స్థానాల్లో యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా ఉన్నాయి. భారతీయ విద్యార్థులు ఈ దేశాలను సురక్షితమైనవిగా భావిస్తున్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న, పరిశోధనలు సాగిస్తున్న ఈ విద్యార్థులు స్వదేశంలో ఎన్నికల ప్రక్రియ లో భాగం పంచుకొంటే, ప్రజాస్వామ్యం మరింత పరిపుష్ట మవుతుంది.

వివిధ దేశాల్లో పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు, కార్మికులు, వృత్తినిపుణుల సంఖ్య భారీగానే ఉంది. వారి సంఖ్య- యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) లో 35లక్షలు, కువైట్‌లో 10లక్షలు, ఒమన్‌లో దాదాపు ఎనిమిది లక్షలు. ఉపాధి కోసం ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వెళుతున్న భారతీయుల సంఖ్య 1970ల నాటి చమురు వెల్లువ తరవాత బాగా పెరిగింది. వారు తాము పనిచేస్తున్న దేశాలకు గణనీయ సేవలు అంద జేయడమే కాకుండా, వివిధ మార్గాల్లో మాతృభూమి రుణం తీర్చుకొంటున్నారు. భారీయెత్తున డబ్బు పంపిస్తూ తమ కుటుంబాలను ఆదుకోవడమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికీ తోడ్పడు తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో పనిచేస్తున్న ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) పంపే డబ్బు విషయంలో భారత్ గతయేడాది అగ్రస్థానంలో నిలిచింది. భారతీయులు నిరుడు సుమారు రూ.4.50 లక్షల కోట్లు (69 బిలియన్ డాలర్లు) స్వదేశానికి పంపారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం- ఈ విషయంలో చైనాను భారత్ మించి పోయింది. ప్రవాస భారతీయుల సంపాదన 25వేల కోట్ల డాలర్ల పైనే ఉంది. భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో అది మూడో వంతు. భారత ఆర్థిక వ్యవస్థ పురోగతికి తమ వంతుగా సహాయపడుతున్న ప్రవాస భారతీయులకు, విదేశాల్లో ఉంటున్న భారత సంతతి ప్రజలకు, పనిచేస్తున్న ప్రదేశాల నుంచే ఓటు వేసే అవకాశం కల్పించా ల్సిన అవసరం ఎంతో ఉంది. దాన్ని కేంద్రప్రభుత్వం గుర్తించింది.

పశ్చిమాసియాలో పెద్దగా నైపుణ్యాలు లేని కార్మికులు ఎక్కువ సంఖ్యలో పనిచేస్తున్నారు. అమెరికా, ఐరోపా విషయానికి వచ్చేసరికి పరిస్థితి భిన్నంగా ఉంది. ఆ దేశాల్లో పనిచేస్తున్న భారతీయుల్లో అత్యధికులు కంప్యూటర్ వృత్తి నిపుణులు, డాక్టర్లు, సాంకేతిక నిపుణులే. జాతీయ సైన్స్ ఫౌండేషన్ నివేదిక ప్రకారం- అమెరికాలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల సంఖ్య 2003-2015 మధ్యకాలంలో 85శాతం పెరిగింది. వీరంతా విదేశాల్లో భారతీయ దూతలుగా వ్యవహరిస్తున్నారు. ఆ దేశాల్లో

భారతదేశ ప్రయోజనాలను పరిరక్షిస్తున్నారు. సంస్కృతి, విద్య, ఆర్థికాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, ఆరోగ్యం, కళల వంటి విషయాల్లో వారు క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. ప్రత్యేకించి సమాచార సాంకేతిక పరిజ్ఞాన రంగంలో తమదైన ముద్ర వేస్తున్నారు. స్వదేశంలో పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు వంటి వాటిలో పెద్ద యెత్తున పెట్టుబడులు పెడుతూ, దేశీయ ఆర్థికాభి వృద్ధికి దోహదపడు తున్నారు. భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

భారతదేశంలో ఓటర్లుగా నమోదై, ఓటుహక్కు పొందిన ప్రవాస భారతీయుల సంఖ్య 24,300కు పైగానే ఉంది. వారిలో 23వేల మందికిపైగా కేరళ రాష్ట్రానికి చెందినవారే కావడం గమనార్హం. పంజాబీలు, గుజరాతీలు, ఇతర రాష్ట్రాలవారు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. విదేశాల్లో పనిచేస్తున్న ప్రవాస భారతీయులకు అక్కడి నుంచే ఓటు వేసే అవకాశం కనుక కల్పిస్తే ఆ హక్కును వారంతా పెద్దయెత్తున సద్వినియోగం చేసుకొనే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ మేరకు రూపొందించిన బిల్లును ఆమోదించటం వల్ల, కోటీ 60లక్షల మంది ప్రవాస భారతీయులకు భారత ఎన్నికల్లో పరోక్షంగా పాల్గొనే అవకాశం దక్కుతుంది. భారత దౌత్య కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి, విదేశాల్లో శాంతిస్థాపక కార్యకలాపాల్లో పాలు పంచుకొంటున్న వారికి మాత్రమే ఇప్పటివరకు పరోక్ష ఓటు పద్ధతిని వర్తింపజేస్తున్నారు. స్వదేశం లో జరిగే ఎన్నికల్లో ఓటు వేయదలచు కొన్న ప్రవాస భారతీయులకు, ఆ హక్కు వినియోగించు కోవడానికి ఏరకంగా అవకాశం కల్పిస్తారని ఇది వరకే సర్వోన్నత న్యాయస్థానం అడిగింది.

### పకడ్బందీగా పట్టాలపైకి

ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం 114 దేశాలు విదేశాల నుంచి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నాయి. అమెరికాలోనైతే పోస్టు, ఫ్యాక్స్, ఈ-మెయిల్ లేదా ఆన్‌లైన్ ద్వారా వారు ఓటుహక్కు వినియోగించుకోవచ్చు. యునైటెడ్ కింగ్‌డమ్‌లో పోస్టు ద్వారా, లేక తమ తరపున ఓటు వేసే అధికారాన్ని ఇంకెవరికైనా ఇవ్వడం ద్వారా వారు ఓటుహక్కును వినియోగించుకోవచ్చు. ప్రవాస భారతీయులు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలంటే ప్రత్యక్షంగా తమ నియోజకవర్గాలకు రావాల్సిందేనని ప్రజాప్రాతినిధ్య చట్టం (2010)లోని 20 (ఎ) నిబంధన స్పష్టం చేస్తోంది. ప్రభుత్వ తాజా బిల్లు ఆమోదంతో ఆ నిర్బేతుక నిబంధనలకు కాలం చెల్లుతుంది. ప్రవాస భారతీయులకు స్థానిక పరిస్థితుల గురించి పెద్దగా అవగాహన ఉండదని, అందువల్ల వారికి ఇలాంటి అవకాశం కల్పించడం సరికాదని కొందరు వాదిస్తున్నారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులకన్నా, స్వదేశంలోనే ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వలసపోయి ఓటుహక్కు కోల్పోతున్నవారి సంఖ్య ఎంతో ఎక్కువ అని, వారికీ ఇలాంటి పరోక్ష ఓటుహక్కు కల్పిస్తారా అని ప్రశ్నిస్తున్నవారూ పెద్దసంఖ్యలోనే ఉన్నారు. ప్రవాస భారతీయులు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోగలరా, తమ యజమానుల ఒత్తిళ్లు, ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించాల్సి వస్తుందేమోనన్న సందేహాలూ కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకొని, ఈ విషయంలో ఎలాంటి అవరోధాలు, సమస్యలు తలెత్తకుండా చూడటానికి ప్రభుత్వం నిర్దిష్ట యంత్రాంగాన్ని, వ్యవస్థనూ ఏర్పాటు చేయాలి. ఏవైపు నుంచీ ఎలాంటి విమర్శలు, ఆరోపణలకు తావీయకుండా ఈ సంస్కరణను సజావుగా పట్టాలకు ఎక్కించినప్పుడే సరైన ఫలితం ఒనగూరుతుంది.


*(ఈనాడు సౌజన్యంతో)* ❐

# రూ.3 లక్షల కోట్ల ఆదా

**యు**వతకు ఉపాధినివ్వటానికి, దేశ ఆదాయాన్ని గణనీయంగా పెంచటానికి వస్త్రరంగంలో చైనా వదిలేసిన అవకాశాల్ని అందిపుచ్చుకోవటంతోపాటు సెల్‌ఫోన్ తయారీని మనదేశంలోనే చేపట్టాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దాదాపు పదేళ్లుగా చెబుతూ వచ్చారు. జేబులో నుంచి సెల్‌ఫోన్ తీసి చూపిస్తూ ఉద్యోగాలు, ఆదాయం గురించి జేపీ వివరిస్తుండటం చాలా కార్యక్రమాల్లో కామన్ దృశ్యంగా ఉండేది. దేశంలో మొబైల్ తయారీ శరవేగంగా పెరుగుతున్నందున, గత నాలుగేళ్లలో రూ. 3 లక్షల కోట్ల మేర విదేశీ మారక ద్రవ్యం ఆదా అయినట్టు తాజాగా ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశంలో తయారవుతున్న సెల్‌ఫోన్ల సంఖ్య 29 కోట్లకు, వాటి విలువ రూ. 1.65 లక్షల కోట్లకు చేరుతుందని తెలిపింది. అప్పటికి దిగుమతులు 5-7 శాతానికి తగ్గిపోతాయని వెల్లడించింది. తొలి రెండు త్రైమాసికాల్లోనే రూ. 75,000 కోట్ల విలువైన 13 కోట్ల సెల్‌ఫోన్లు దేశీయంగా తయారవుతున్నాయని ఐసీఈఏ నివేదిక వివరించింది. సెల్‌ఫోన్ల తయారీలో చైనా తరువాత స్థానం ద్వారా, ప్రపంచంలోనే రెండో అతి పెద్ద కేంద్రంగా భారత్ అవతరించిందని ఐసీఈఏ ప్రతినిధి తెలిపారు.

# 'లాలూచీ లంచానికి - గతిలేక బలవంతంగా ఇచ్చే లంచానికి' తేడా చూడకుండా గుడ్డిగా చేసిన చట్ట సవరణలు

- సత్యా రాణి




కార్ల్‌మార్క్స్ చేసిన కొన్ని మౌలిక ప్రాతిపదికలకు కాలపరిమితులున్నాయిగానీ, ఆయన చెప్పిన ఒక ప్రాతిపదిక మాత్రం కాలాతీతమని భావించవచ్చు. తత్వశాస్త్రానికి సంబంధించి ఆయన ఆ ప్రాతిపదికను చెప్పినా, అది అన్ని రంగాలకూ, నిత్యజీవితానికీ వర్తించే విలువ అని కూడా చెప్పుకోవచ్చు. 'సమాజాన్ని/ప్రపంచాన్ని రకరకాలుగా విశ్లేషించటమే కాదు, అందులోని లోపాల్ని కూడా సరిచేయాలి' అని ఆయన తత్వవేత్తల నుద్దేశించి చెప్పారు (మార్క్స్ సమాధి మీద కూడా ఈ మాటల్ని లిఖించారు). తన మాటల్ని ఆయన ఆచరించి సైతం చూపారు. సమసమాజ స్థాపనకు శాశ్వత సూత్రాలను వెలువరించేందుకు బృహత్ ప్రయత్నం చేశారు. సమాజాన్ని విశ్లేషిస్తూ లోపాల్ని సరిదిద్దే ప్రయత్నం చేయటం.. మార్క్స్ పాటించిన ఈ విలువను ఒక సమాజంలోని ప్రజానీకం తన పరిధిలో ఎంత చైతన్యవంతంగా పాటిస్తోంది అన్నదాని మీదే ఆ సమాజం, దేశం అభివృద్ధి, పురోగమనం ఉంటాయి. ప్రస్తుతం ఆ పనిని ఒక సమాజంగా తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో మనం చెయ్యాల్సిన స్థాయిలో చేయటం లేదనేది వాస్తవం.

ఆదర్శ భావాలుండే యువ జనాభాయే ఎక్కువగా ఉన్నా.. సమాజంలోని చెడును తొలగించే పని మన దేశంలో అంత చురుగ్గా జరగటం లేదు. సమాజంలో మిగిలినవారెలా ఉన్నా, తప్పుల్ని సరిచేసేందుకు కాస్త ఎక్కువ స్పేస్ ఇచ్చి పనిచేయాల్సిన బాధ్యత మీడియాకు ఉంది. అందుకే ఫోర్త్ ఎస్టేట్ అని కూడా ఆ రంగాన్ని పిలుస్తారు. కానీ ఇటీవల అవినీతి నిరోధక చట్టం, 1988కి పార్లమెంటులోని అన్ని పార్టీలూ కలిసి అసంబద్ధమైన సవరణలు చేసి కుమ్మక్కయినట్టు ఆమోదిస్తే.. ఆ లాలూచీని మీడియా ఎండగట్టే ప్రయత్నం చేయలేదు. ఆ అంశం మీద ప్రజల్లో చర్చలు రగిలించి చైతన్యపరచటం కష్టమే. కానీ అందులోని లోపాల్ని నిశితంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత మాత్రం మీడియాకుంది. తెలుగులో ఒకట్రెండు పత్రికలు కొన్ని వ్యాసాలను ప్రచురించాయి. కొన్ని ప్రభావశీలమైన కార్టూన్లను వేశాయి. ఈ విషయంలో జాతీయ స్థాయి మీడియా కన్నా తెలుగు పత్రికలు కొంత నాణ్యతతో స్పందించాయన్నదే తెలుగువారికి కొంత ఊరట.

తెలుగు పత్రికల్లో వచ్చిన కాసిని వ్యాసాల్లో కూడా అందరూ దాదాపుగా చట్టసవరణల్ని అసంబద్ధమనే పేర్కొన్నారు. అయితే ఓ విశ్రాంత పోలీసు ఉన్నతాధికారి రాసిన వ్యాసంలో కొన్ని వాక్యాలు నిరుత్సాహం కలిగించాయి. 'లంచం ఇచ్చిన ప్రజలను అరెస్టు చేసేలా చట్టానికి సవరణ చేశారు. ఇది దారుణం అని పలు పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ రకమైన నిబంధన గతంలో కూడా చట్టంలో ఉంది' అని ఆయన రాశారు.

అయ్యా! ఈ నిబంధన గతంలోనే ఉంటే.. 'హక్కుగా అందాల్సిన సేవలకు గతిలేక లంచం ఇచ్చినా సరే.. విధిగా 3 ఏళ్లు, గరిష్ఠంగా 7 ఏళ్ల జైలు' అని కొత్తగా ఎందుకు సవరణ చేశారు?

లంచం ఇవ్వటం కూడా నేరంలో పరోక్షంగా భాగమే, ఆ రకంగా నేరాన్ని ఆపాదించొచ్చు అని వాదించవచ్చు. అయితే బలవంతంగా, గతిలేక లంచం ఇవ్వటానికి, లాలూచీ పడి లంచం ఇవ్వటానికి మధ్య తేడాని చూడకపోతే.. అవినీతి నిరోధానికి బదులు జైళ్లు నింపటానికి మనం చట్టం చేసినట్టవుతుంది. మెడ మీద తలకాయ ఉన్నవాడెవడూ దీన్ని చట్టం చేయటం అనరు. సదరు ఉన్నతాధికారి రాసిన లెక్కప్రకారం, అసలు అవినీతి నిరోధక చట్టం కూడా అవసరం లేదు. ఎందుకంటే, అవినీతి అంటేనే

చట్టవిరుద్ధం కాబట్టి.. పోలీసులే సరిపోతారు. ప్రత్యేకించి ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ అనేది ఎందుకింక?.. ఇవన్నీ ఆయనకి తెలియక కాదు. కానీ ప్రజల్లో స్పందన లేదు కాబట్టి.. ప్రజాభిప్రాయం పేరుతో పాలకుల చెదుకు, నడుస్తున్న ట్రెండ్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ సౌకర్యాల్ని పొందటంలో తప్పు లేదు అని ఆయన అనుకున్నట్టున్నారు. కానీ ఆయన వయసు, విజ్ఞత, సామాజిక బాధ్యత అన్నీ మరుగునపడిపోయాయని గుర్తించటం లేదు.

ఇక చట్ట సవరణల విషయానికొస్తే, జులై 24, 2018న పార్లమెంటు ఆమోదం పొంది వెనువెంటనే చట్టబద్ధమైన ఈ సవరణలతో ఇప్పుడు అవినీతి నిరోధక చట్టం.. ప్రభుత్వ అధికారులకు క్లీన్‌చిట్, సామాన్య ప్రజల మీద వారెంట్‌లకు తెల్లకాగితం అన్నట్టు తయారైంది. లంచంగొండితనంలో భాగస్వామి అయిన సామాన్యుడు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి 7 రోజులు మాత్రమే గడువు, అధికారులకు మాత్రం కావలసినన్ని రోజులకు తగిన వెసులుబాటు. లంచం తీసుకున్నారన్న ఆరోపణపై అధికారి మీద దర్యాప్తు మొదలుపెట్టాలన్నా కూడా పై అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. ఇలాంటి చట్టం.. రాజ్యాంగాన్ని ఉల్లంఘించటం కాదా? సమాన హక్కులకు వ్యతిరేకం కాదా? ప్రభుత్వాధికారులు మొదటి తరగతి పౌరులైతే, సామాన్య ప్రజలు రెండో తరగతి పౌరులా? ప్రభుత్వాధికారులు ఉన్నది ప్రజలకు సేవ చేయడానికా? లేక వారి మీద పెత్తనం చేయటానికా?

అధికారులు-నేతల మధ్య అనుచిత స్నేహాన్ని వ్యతిరేకిస్తూ చట్టం తీసుకురావటం మన చట్టసభ సభ్యులకు చాలా బాధాకరమైన పని. అలా చట్టం చేసిన సంఘటనలు బహు తక్కువ. పలు దేశాల్లో కూడా ఈ ధోరణి ఉన్నా, మనదేశంలో మరీ ఎక్కువ. ధీశాలినని చాటుకునే నరేంద్రమోదీ లాంటి ప్రధాని కూడా ప్రభుత్వోద్యోగుల సంఘటిత శక్తికి భయపడినట్టు ఈ సవరణలు వెల్లడిస్తున్నాయి. అవినీతి నిరోధక చట్టానికి ఈ అసంబద్ధ సవరణలను 2013లో యూపీయే ప్రభుత్వం ప్రతిపాదించినప్పటి నుంచీ.. ఇవి ఎంత అప్రజాస్వామికమైనవో, ప్రజల సార్వభౌమాధికారాన్ని ఎంతగా కుంగదీసేవో చెబుతూ లోక్‌సత్తా/ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ఎలుగెత్తింది. పార్లమెంటరీ కమిటీ ముందు వాదనలు వినిపించింది. తాజా పార్లమెంటులో అన్ని పార్టీలకూ, అందరు సభ్యులకూ లేఖలు, పూర్తి వివరాల సమాచారాన్నీ అందించింది. అయినా కూడా పిల్లలాట రాజకీయానికవి నీతివాక్యాలుగానే కనిపించాయి.

లంచం ఇచ్చే వారు (సామాన్య పౌరులైనా సరే), తీసుకునే వారు ఇద్దరూ గనక లాలూచీ పడి దేశ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తే, ఆ రకమైన అవినీతిని ప్రత్యేకించి నిర్వచిస్తూ మరింత కఠిన శిక్షలు విధించాలని 2జీ స్పెక్ట్రం కుంభకోణం కేసులో దాఖలు చేసిన పిటిషన్‌లో లోక్‌సత్తా వాదించింది. ఆ వాదనను సుప్రీంకోర్టు అంగీకరించింది. లోక్‌సత్తా వాదనల ప్రాతిపదికనే 2జీ అక్రమ లైసెన్సుల్ని 2012 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు రద్దు చేసింది. రెండవ పరిపాలనా సంస్కరణల సంఘంలో సభ్యునిగా కూడా ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అవినీతి నిరోధానికి 'లాలూచీ అవినీతి' మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అవినీతి నిరోధక చట్టానికి ఆమోదించిన తాజా సవరణల్లో లాలూచీ అవినీతి వల్ల నష్టాన్ని గుర్తించారు. ఈ అంశాన్ని ప్రత్యేకించి చేర్చారు. సంతోషం. అయితే లాలూచీ అవినీతికి, విధిలేక బలవంతంగా ఇచ్చే లంచానికి మధ్య తేడాను గుర్తించటంలో విఫలమయ్యారు. ప్రజలను సరకుగా, పావులుగా చులకన చేయకుండా ప్రజాస్వామ్యంలో సార్వభౌములుగా పార్లమెంటు సభ్యులు, ప్రభుత్వం, ప్రధాన పార్టీలు గుర్తించి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేది కాదు. 2017లో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. మన దేశంలో ప్రతి 10 మందిలో ఏడుగురు లంచాల ద్వారా లేదా ఇతరత్రా తోడ్పాటు తీసుకోవటం ద్వారా మాత్రమే ప్రభుత్వ అధికారిక సేవలను వినియోగించుకుంటున్నారు. మనదేశంలో లంచగొండితనం ప్రధానంగా పౌరుల నిస్సహాయత వల్ల విశృంఖలమైంది. మరి అలాంటి ప్రజలను నేరస్తులనటం ఏ రకమైన న్యాయం?

ఇదేకాకుండా, ప్రజావసరాలకు ఉచిత సరఫరాలు చేసే ప్రైవేటు సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు- ప్రభుత్వం నుంచి నిధులు తీసుకుంటున్నప్పటికీ ఈ చట్టం పరిధిలోకి రావు. దీనివల్ల, లంచం నుంచి వచ్చిన డబ్బును అటువంటి సంస్థలకు మళ్లించినా చర్యలుండవు.

చూస్తుంటే, ఆశ్రిత పక్షపాతం వ్యక్తుల స్థాయి నుంచి ప్రభుత్వం స్థాయికి పెరిగినట్టు కనిపిస్తోంది. ప్రభుత్వం, అందులోనివారు ఒక తెగ, ప్రజల ఇంకో తెగ అని పాలకులు భావిస్తున్నట్టుంది.

ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ ఉన్నతాధికారులను న్యాయపరమైన చిక్కుల నుంచి విడిపించడమే అని అవగమవుతున్నది. నిజాయతీపరులైన అధికారులకు రక్షణ

కల్పించటాన్ని ఎవరూ తప్పుపట్టలేరు, కానీ దానికి ఇదా పద్ధతి? ఓ సర్కారీ ఉద్యోగి అవినీతికి పాల్పడ్డాడని స్థానిక ప్రజలు, పార్టీలు, ప్రజాప్రతినిధులు, మీడియా అందరికీ తెలిసినా కూడా చర్యలు తీసుకోవటం కష్టమనే రీతిలో చట్ట సవరణల్ని రూపొందించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వోద్యోగిని దర్యాప్తు చేడానికి దరఖాస్తుల్ని కూడా కేవలం లా ఎన్‌ఫోర్సింగ్ అధికారి మాత్రమే పెట్టవచ్చు. సర్కారీ చిన్న ఉద్యోగికి కూడా ఇన్ని భద్రతలు కల్పించిన చట్టం.. సామాన్య ప్రజలకు కేవలం 7 రోజులు ఇచ్చింది. ఈ సమయంలోపు ఫిర్యాదు చేయకపోతే, వాళ్లు చట్టం దృష్టిలో నేరస్తులవుతారు. ఆరోపించబడిన అధికారికి వ్యతిరేకంగా సాక్షిగా నిలబడినా గానీ, ప్రజలకు శిక్ష తగ్గదు. అధికారులకు వ్యతిరేకంగా సాక్ష్యమివ్వటానికి కూడా జనం భయపడే రకంగా చట్ట సవరణలు చేశారు.

ప్రజల్లో పెద్దఎత్తున చర్చనీయాంశం కాకుండా ఈ రకమైన సవరణలకు గురైన చట్టం.. లంచగొండితనాన్ని నిర్మూలించ గలుగుతుందా? అవినీతిని అరికడుతుందా? ఈ చట్టం కంటే కూడా ఇప్పుడు ప్రజలకు నిర్దిష్ట కాలపరిమితిలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనినీ చేసిపెట్టేలా 'పౌర సేవల' (సర్వీస్ గ్యారంటీ/రైట్ టూ సర్వీసెస్) చట్టాన్ని తీసుకొచ్చి ఉంటే ఎంతో మెరుగ్గా ఉండేది.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనికీ కాలవ్యవధిని సూచిస్తూ బోర్డులు (సిటిజన్ చార్టర్లు) పెట్టటం, ఆ గడువులోగా పని చేయకపోతే రోజుకు రూ. 250కి తగ్గకుండా దరఖాస్తుదారునికి పరిహారం చెల్లించటం వంటి అంశాలతో ఎలక్ట్రానిక్ సేవలను కూడా అనుసంధానిస్తూ 2011లో పౌర సేవల చట్టం తెచ్చేందుకు పార్లమెంటులో ఒక ప్రయత్నం జరిగింది. పార్లమెంటరీ కమిటీ విజ్ఞప్తి మేరకు ఆ బిల్లును ఎఫ్‌డీఆర్ రూపొందించింది. అయినా వాయిదా పడుతూ వస్తోంది. తెలుగునాట రాష్ట్ర విభజన జరిగాక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు కూడా బిల్లుల్ని రూపొందించి ఎఫ్‌డీఆర్ పంపింది. సుపరిపాలన చట్టం, మరో చట్టం తెస్తాం అంటూ ఏపీ ప్రభుత్వం కాలక్షేపం చేస్తుండగా, నల్సార్‌కు పంపాం, త్వరలో తెచ్చేస్తామంటూ తెలంగాణ ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్లి అసెంబ్లీనే రద్దు చేసింది.

పాలన అంటే కేవలం ఎన్నికలు అనే స్థాయికి రాజకీయం దిగజారక ఇటువంటి అంశాలపై చర్చకు చొరవ కనిపించదు. కానీ, ప్రజల పన్నుల డబ్బుతో రూపొందించే బడ్జెట్‌లో దాదాపు సగం డబ్బుని జీతభత్యాల రూపంలో తీసుకునే ఒకట్రెండు శాతం మంది ప్రభుత్వోద్యోగుల చేత ప్రజలకు సేవ చేయించే (తమ బాధ్యతల్లో భాగంగానే) చట్టాన్ని స్వతంత్రం వచ్చి 70 ఏళ్లయినా తీసుకురాలేకపోయారంటే ఎంత సిగ్గుచేటు! పైపై ఆకర్షణలను, తాత్కాలిక ప్రయోజనాల్ని దాటి కొంచెం ఆలోచించగలిగితే చాలు.. అవినీతిపై మన పాలకుల ప్రగల్భాలు, దొంగయుద్ధాల్ని దాటి అవినీతి అంతానికి మనం నిజంగా చేపట్టాల్సిన ఆచరణాత్మక పరిష్కారాల మీద దృష్టి సారించగలుగుతాం. ❐

## యువతకు క్లారిటీనిచ్చే మేధో వేదికలు కావాలి



"నేను ఉదయమే హైదరాబాద్‌లోని ఒక మహిళా కళాశాలను సందర్శించాను. దాదాపు 2,000 మంది విద్యార్థినులు సమావేశంలో పాల్గొన్నారు. కులాంతర వివాహాలకు వ్యతిరేకంగా మిర్యాలగూడ, ఎర్రగడ్డల్లో తల్లిదండ్రులు చేసిన ఘాతుకాల గురించి వారిని ప్రశ్నించాను. కొందరు తల్లిదండ్రులది తప్పు అన్నారు. అమ్మానాన్నలను ధిక్కరించిన అమ్మాయిలదే తప్పన్నవారు కూడా పెద్దసంఖ్యలోనే ఉన్నారు. కానీ మొత్తంగా ఆ సమావేశంలోని 70 శాతం మందికి ఈ విషయంలో ఏది మంచి, ఏది చెడు అని చెప్పే స్పష్టత లేదు. పరిష్కారాలు ఎవరూ సరిగా చెప్పలేకపోయారు. విషయాల్ని ఎలా అర్థం చేసుకోవాలి, ఎలా ఆలోచించాలి, వాటిపై స్పందించటానికి ఎటువంటి ప్రాతిపదిక ఉండాలి.. అని క్లారిటీనిచ్చే మేధో వేదికల అవసరం మన సమాజానికి ఎంతో ఉంది. కొందరు చట్టాల వల్ల ఉపయోగమేంటి అంటున్నారు. కానీ హైదరాబాద్‌లో సీసీ కెమెరాలు పెట్టాక నేరాల సంఖ్య 30–40 శాతం తగ్గింది (హైదరాబాద్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం లోక్‌సత్తాయే పోరాడింది). సరైన రీతిలో, ఏర్పాట్లతో చట్టాల్ని రూపొందిస్తే వాటి వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది."

– బి. సుమతి,

నార్త్‌జోన్ డీసీపీ, హైదరాబాద్ (ఒక టీవీ ఛానల్ చర్చలో మాట్లాడుతూ)

# ప్రభుత్వ వైద్య కళాశాల కోసం లోక్‌సత్తా పోరాటం

విజయనగరం జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేయాలని లోక్‌సత్తా పార్టీ నాలుగేళ్లుగా గట్టి పోరాటాలు చేస్తోందని, సమాజం కోసం ఎంతోకొంత సమయాన్నిస్తూ కొత్తతరం కూడా ఇందులో భాగస్వాములు కావాలని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు అల్లంశెట్టి నాగభూషణం విజ్ఞప్తి చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్పష్టమైన ఎజెండా, డిమాండ్లు లేకుండా జరిగే ఎన్నికల వల్ల ఏమీ ఉపయోగం ఉండదని, ఈ విషయాన్ని జనంలోకి బాగా తీసుకెళ్లాలని అన్నారు. మనకు ఇప్పుడు, మున్ముందు కూడా ఉపయోగ పడే డిమాండ్లను రూపొందించుకుని వాటి కోసం పార్టీల్ని, నేతల్ని సతాయించాలనే చైతన్యం యువతలో బాగా రావాలన్నారు. జిల్లాలో సరైన వైద్యం అందక, నివారించ దగ్గ జబ్బులతో పలువురు మరణిస్తున్నారని, దీన్ని ఆపేందుకు సర్కారీ వైద్యాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల కోసం, అందరికీ అందుబాటులో నాణ్యమైన వైద్యం కోసం ఇకనైనా






పట్టుబట్టాలన్నారు. మెడికల్ కాలేజీ కోసం లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ నిర్వహించిన వలు కార్యక్రమాల గురించి నాగభూషణం వివరించారు. అన్ని పార్టీలూ ఈ విషయంలో లోక్‌సత్తా ఆందోళనకు మద్దతిచ్చాయని, ఇటీవల కోట వద్ద బాబ్జీ నిర్వహించిన నిరసన దీక్షకు ఉత్తరాంధ్ర చర్చా వేదిక అధ్యక్షుడు కొణతాల రామకృష్ణ, వైసీపీ ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఎమ్మెల్యే బత్స అప్పల నర్సయ్య, సీపీఎం నాయకుడు రెడ్డి శంకర్రావు, సీపీఐ నాయకుడు బుగత సూరిబాబు, కాంగ్రెస్ నేత బుంగ భానుమూర్తి, జనసేన నేతలు బాలు, రవి, చీడికాడ జడ్పీటీసీ సత్యవతి, జేటీ రామారావు, ప్రజాసంఘాల ప్రతినిధులు మోహన్, లోగిన రామకృష్ణ, చోడి ఆదినారాయణ, రామారావు, నేరెళ్ల వెంకటరావు, ఇతర నాయకులు ఆకుల దామోదరయ్య, సత్యం, పాపారావు, గౌరీశంకర్, ఆకుల నాగేశ్వరరావు, జానకిరామ్, దప్పు శ్రీను, ఉదయ భాస్కర్, రాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారని తెలిపారు. ఈ అంశాన్ని ఎన్నికల ఎజెండాగా మలచాలని కోరారు.

# ఉత్తరాంధ్రలో ఆరోగ్య అత్యవసర పరిస్థితి ప్రకటించాలి




మన్యం, మైదాన ప్రాంతం అని తేడా లేకుండా మూడు నెలలుగా ప్రజలు విషజ్వరాలతో దారుణ పరిస్థితుల నెదుర్కొంటున్నా, పెద్దసంఖ్యలో పిట్టల్లా రాలిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదని భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పేరుతో అడ్డగోలు దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో సిబ్బంది, సౌకర్యాలు కరవయ్యాయన్నారు. విజయవాడలో లోక్‌సత్తా నేతలతో కలిసి పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రాథమిక వైద్యాన్ని బలోపేతం చేసి, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని, పరిస్థితి తీవ్రంగా ఉన్న ఉత్తరాంధ్రలో ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ నేతలు పూర్ణచంద్రరావు, రవితేజ, సుబ్బారావు, లక్ష్మి, చందూ శ్రీనివాస్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిని శక్తిగా మార్చేదే గాంధేయం




**గాం**ధీజీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని పనిచేయటం ప్రారంభిస్తే మామూలు యువత కూడా గొప్పవారుగా ఎదుగుతారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఎన్నో అవమానాలను ఎదుర్కొని ఓ వ్యక్తి శక్తిగా ఎదగడం గాంధీ నేర్పిన గొప్ప పాఠమన్నారు. తన జీవితమే సందేశంగా ఆయన జీవించారన్నారు. మహాత్మాగాంధీ 150వ జన్మదినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి వద్ద మునిసిపల్ మైదానంలో 'గాంధేయం' పేరుతో నిర్వహించిన గాంధేయం భారతీయ జీవన వేదం, 150 గాంధీజీ విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవంలో ప్రత్యేక అతిథిగా, ప్రధాన వక్తగా జేపీ పాల్గొన్నారు. 'భావితరం–గాంధేయం'పై ప్రసంగించారు. పి.వి.ఎస్ రామ్మోహన రావు ఫౌండేషన్, గాంధీ స్మారకనిధి జిల్లా శాఖ, సిక్కోలు సైన్యం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ 150 గాంధీ విగ్రహాలనూ జిల్లాలోని 150 హైస్కూళ్లు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రతిష్ఠిస్తారు.

గాంధీజీ గొప్పతనం దేశానికి స్వతంత్రం తేవటంలో లేదని, ఒక సంస్కృతిని ఒక జాతిగా తీర్చిదిద్దటంలో ఉందని జేపీ అన్నారు. గాంధీజీ లేకుంటే నూతన భరత జాతి లేదన్నారు. స్వతంత్రం అంటే జనం భవిష్యత్, జనం బాగోగులు, ఉమ్మడి ప్రయోజనం అని గురజాడ చెప్పారని, ఆయన మాటలకు ఆచరణ రూపం గాంధీజీ అని వివరించారు. దేశానికి స్వతంత్రం వచ్చిన రోజున బాపూజీ ఢిల్లీకి దూరంగా ఉపవాసం ఉంటూ కన్నీరు కార్చారని, ఏ పని చేసినా ప్రచారం కాదు ప్రయోజనం ముఖ్యమని అన్నారు. కుల, మత విభేదాలు, ప్రాంతీయ భావనలు ఉన్నంతవరకూ గాంధీని స్మరించే అర్హత లేదన్నారు. కొన్ని విషయాల్లో తాను కూడా గాంధీతో విభేదిస్తానన్నారు. గాంధీజీ విదేశీ వస్తు బహిష్కరణకు పిలుపు నిచ్చారనో, దేశానికి స్వతంత్రం తెచ్చారనో కాకుండా.. అహరహం జాతి నిర్మాణం, మానవాళి ఔన్నత్యం కోసం ఆయన చేసిన కృషిని, వ్యక్తిగత నిబద్ధతను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గాంధేయం నిర్వాహకుల్ని, నాట్యాచార్యులు రఘుపాత్రుని శ్రీకాంత్‌ను, విగ్రహాల రూపశిల్పుల్ని జేపీ ప్రత్యేకించి అభినందించారు. గాంధీయిజం వ్యాప్తి కోసం చేపట్టిన ఈ భావజాల ఉద్యమంలో తాను కూడా భాగం అవుతానన్నారు. గాంధీ తత్వాన్ని అందరూ అర్థం చేసుకుని పర్యావరణహిత కార్యక్రమాలను చేపట్టేందుకు సంకల్పించాలన్నారు. గాంధీ మార్గంలో సత్యాన్ని ఆచరించడానికి ఎన్ని ఒడి దుడుకులు ఎదురైనా వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, వందసార్లు గెలిచిన అబద్ధాల కంటే ఒక్కసారి గెలిచిన సత్యం ఎంతో ప్రభావ శీలంగా కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమం లో ఏడు ప్రపంచ రికార్డులు నమోద య్యాయి. ఇండియా బుక్, లిమ్కా బుక్, జీనియస్ బుక్, భారత్ వరల్డ్, తెలుగు బుక్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్స్ ఫోరం ప్రతినిధులు ధృవీకరణ పత్రాల్ని, పతకాల్ని అందజేశారు.

ఎంపీ కింజరపు రామ్మోహన నాయుడు, ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, గాంధీ స్మారకనిధి రాష్ట్ర అధ్యక్షుడు పీసీ గాంధీ, కలెక్టర్ ధనుంజయరెడ్డి, జేసీ చక్రధరబాబు, గాంధీ స్మారక నిధి రాష్ట్ర సభ్యుడు ఎం. ప్రసాదరావు, సిక్కోలు సైన్యం వ్యవస్థాపకుడు ఎం.వి.ఎస్.ఎస్ శాస్త్రి, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాజకీయ నేతలు, పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ❐



### విభజన చట్టంపై నిపుణుల నివేదిక

వార్డు సభ్యుడి నుంచి దేశ ప్రధాని వరకు స్వార్థంతో ఓటు రాజకీయాలు చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నిర్దిష్టమైన, ఆచరణ సాధ్యమైన, విశ్వసనీయత గల ఎన్నికల ప్రణాళికతో లోక్‌సత్తా పార్టీ వ్యవహరిస్తుందని జేపీ మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన హామీలను నెరవేర్చటంలో కేంద్రం తీరును ఆయన ఆక్షేపించారు. విభజన సమయంలో పార్లమెంటులో అప్పటి ప్రధాని హామీలు, చట్టం అమలుకు ఇప్పుడు కేంద్రం తీసుకోవాల్సిన చర్యలపై స్వతంత్ర నిపుణులతో లోక్‌సత్తా నివేదిక రూపొందిస్తోందని, ఇందులో ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు ఆచార్య వై.కె అలగ్, 14వ ఆర్థిక సంఘం సభ్యుడు ఆచార్య అతుల్ శర్మ, ఎం.గోవిందరావు, చెన్నైకు చెందిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఆర్.కె షణ్ముగం సభ్యులుగా ఉన్నారన్నారు. ఈ నెలలోనే నివేదికను ప్రజల ముందుంచుతామన్నారు. ఈ సమావేశంలో లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, నేతలు కొత్తకోట పోలినాయుడు, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, పంచాది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# # I Don't want Unemployment Allowance, I want EMPLOYMENT

**"నేను నా నిరుద్యోగ భృతిని స్వచ్ఛందంగా వదులుకుంటున్నాను,**

**నాకు నిరుద్యోగ భృతి వద్దు, ఉద్యోగమే కావాలి.**

**కష్టపడి పనిచేసి సంపాదించుకునే**

**ఉపాధి అవకాశాల్ని కల్పించాలని పాలకుల్ని కోరుతున్నాను"**

('ముఖ్యమంత్రి యువనేస్తం' పేరుతో నిరుద్యోగ భృతిని ఇస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, అదే రకం హామీని తెలంగాణలో ఇచ్చిన రాజకీయ పార్టీలకు అర్థమయ్యేలా ఈ మెస్సేజీని విస్తృతంగా షేర్ చేయాలని యువ మిత్రులకు, పౌర సమాజానికి విజ్ఞప్తి).

Posting Date 07-10-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on October 1st, 2018




ప్రతి ఒక్కరి,
ప్రతి ఇంటి పుస్తకం

తప్పక చదవండి,
చదివించండి

పేజీలు : 64

వెల : రూ. 20/-

**Book-Post**
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad